# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 28-1-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 146 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## చిరంజీవికి సీఎం కేసీఆర్ ఫోన్

హైదరాబాద్, జనవరి 27: మెగాస్టార్ చిరంజీవికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫోన్ చేశారు. కరోనా బారిన పడ్డ చిరంజీవిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కరోనా నుంచి త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు. అలాగే చిరంజీవి కుటుంబ సభ్యులతో కూడా కేసీఆర్ మాట్లాడారు.

గత కొన్ని రోజులుగా తెలంగాణ ప్రభుత్వానికి, సినీ పరిశ్రమకు మధ్య వారధిగా ఉన్న చిరంజీవి అనేకసార్లు ముఖ్యమంత్రిని కలిశారు. సినీ పరిశ్రమకు సంబంధించి అనేక అంశాలు, సమస్యలు, ప్రభుత్వం నుంచి రావాల్సిన సహకారం విషయంలో కేసీఆర్‌తో సంప్రదింపులు జరిపారు. కాగా తాను కరోనా బారిన పడినట్లు నిన్న చిరంజీవి ట్విట్టర్ వేదికగా ప్రకటించిన విషయం తెలిసిందే. సీఎం కేసీఆర్ తనకు ఫోన్ చేసి పరామర్శించడం పట్ల చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు.

## ఒమిక్రాన్ స్పీడ్గా వ్యాపిస్తున్నా.. డేంజర్ తక్కువే..
## కానీ, జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

హైదరాబాద్, జనవరి 27:కరోనా కొత్త వేరియంట్ అయిన ఒమిక్రాన్ ఇప్పుడు దేశంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తోందని కేంద్ర ప్రభుత్వం ఈ రోజు తెలిపింది. కేసుల సంఖ్య కూడా అధికంగా ఉన్నట్టు పేర్కొంది. దేశంలోని మొత్తం యాక్టివ్ కేసులలో 77 శాతానికిపైగా పది రాష్ట్రాలే కారణమని ఆరోగ్య మంత్రిత్వ శాఖ మీడియాకు వెల్లడించింది. అయితే మరణాల సంఖ్య తగ్గడానికి ప్రభుత్వం విస్తృతంగా టీకాలు పంపిణీ చేస్తోందని అధికారులు వెల్లడించారు. యాక్టివ్ కేసుల సంఖ్య, సంబంధిత మరణాలు ఈ వేవ్‌లో చాలా తక్కువగా ఉన్నాయి, అంటువ్యాధుల తీవ్రత కూడా ఈ వేవ్లో చాలా తక్కువగా ఉందని తెలిపారు వైద్యారోగ్య అధికారులు.

90 శాతానికి పైగా కేసులు తేలికపాటి నుండి మితమైన తీవ్రతతో హోమ్ ఐసోలేషన్‌లో ఉంటే సరిపోతుందని, ఆక్సిజన్, ఐసియు బెడ్‌లు అవసరమయ్యే కేసులు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయని వైద్యారోగ్య వర్గాలు తెలిపాయి. తగినన్ని వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయని, ఎక్కువ మందికి వ్యాక్సిన్ వేయడం వైరస్‌తో పోరాడడంలో అత్యంత ముఖ్యమైన దశ అని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఎఐఓఖీ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ బలరామ్ భార్గవ అన్నారు. ఇతర వ్యాధులు ఉన్న రోగులు జాగ్రత్తగా ఉండాలని, ఎక్కువ మంది గుమిగూడే ప్రాంతాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు డాక్టర్ భార్గవ. వైరస్ వ్యాప్తికి సంబంధించి కొన్ని గణాంకాలను హైలైట్ చేస్తూ.. 11 రాష్ట్రాల్లో 50,000 కంటే ఎక్కువ యాక్టివ్ కేసులు ఉన్నాయన్నారు. 14 రాష్ట్రాల్లో 10,000 నుండి 50,000 యాక్టివ్ కేసులు ఉన్నాయని కేంద్రం తెలిపింది. దేశంలోని 551 జిల్లాలు ఐదు శాతానికి పైగా సానుకూలత రేటును కలిగి ఉన్నాయి. ఇది గత వారం 527 జిల్లాల నుంచి పెరగడం కనిపిస్తోంది. ప్రభుత్వం టెలిమెడిసిన్ కోసం ఇ?–సంజీవని ప్లాట్‌ఫారమ్‌ను కూడా ప్రారంభించింది. ఇప్పటి వరకు 2.3 కోట్లకు పైగా టెలికన్సల్టేషన్ అందించినట్టు అధికారులు తెలిపారు.

## పంజాబ్ ఎన్నికల కోసం బీజేపీ అభ్యర్థుల రెండో జాబితా విడుదల

న్యూఢిల్లీ, జనవరి 27:పంజాబ్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 27 మంది అభ్యర్థులతో బీజేపీ రెండో జాబితా విడుదల చేసింది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల కోసం 27 మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాను విడుదల చేసినట్లు బీజేపీ పేర్కొంది. ఈ జాబితాలో కేంద్ర మాజీ మంత్రి విజయ్ సంప్లా కూడా ఉన్నారు. ఫగ్వారా నుంచి ఆయన పోటీ చేయనున్నారు. మాజీ ఐపీఎస్ అధికారి ఇక్బాల్ సింగ్ లాల్‌పురా రూప్‌నగర్ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. ఎమ్మెల్యేలు ఫతే సింగ్ బజ్వా, కాంగ్రెస్‌ను విడిచిపెట్టి బీజేపీలో చేరిన హర్జోత్ కమల్ బటాలా మరియు మోగా నుంచి బరిలోకి దిగారు.

## వ్యవసాయ రంగానికి రుణ పరపతి పెంచాలి: మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 27:రైతుల ప్రయోజనాల కోసం పాటుపడుతన్న తెలంగాణలో వ్యవసాయ రంగానికి రుణ పరపతి పెంచాల్సిన అవసరం ఎంతయినా వుందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. జనాభాలో 60 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తించారని చెప్పారు. అందుకే నాబార్డ్ సహకారంతో మిషన్ కాకతీయ పథకం కింద చెరువులు, కుంటల పునరుద్ధరణతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని అన్నారు. గురువారం



నగరంలోని మంత్రుల నివాస సముదాయంలోని మంత్రి నివాసంలో రాబోయే 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి గాను లక్షా 66 వేల 384 కోట్ల రుణ సామర్థ్యంతో నాబార్డు రూపొందించిన రాష్ట్ర దృష్టి పత్రాన్ని పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి విడుదల చేశారు.

అనంతరం వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ,పంచాయతీ రాజ్ శాఖా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడారు. మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికి తాగునీరు పథకాన్ని పూర్తిచేసిన ఘనత సీఎం కేసీఆర్ దేనని అన్నారు. ఈ పథకాల మూలంగా తెలంగాణ వ్యాప్తంగా భూగర్భజలాలు పెరిగాయన్నారు. పంటల విస్తీర్ణం పెరగడంతో పాటు రికార్డు స్థాయిలో వరి ధాన్యం ఉత్పత్తి జరుగుతున్నది.

కానీ సుస్థిర వ్యవసాయం ప్రాధాన్యం గుర్తించి పంట వైవిద్యీకరణలో భాగంగా రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా ధీర్ఘకాలిక ఆయిల్ పామ్ వంటి పంట సాగును ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నదని మంత్రులు తెలిపారు. దీనికోసం నాబార్డు సూచనల మేరకు క్షేత్రస్థాయిలో బ్యాంకర్లు ఆయిల్ పామ్ సాగుకు సహకరించాలని కోరారు. రైతుల ఆదాయాన్ని పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం, ఆహారశుద్ది రంగంలో ప్రత్యేక జోన్లను ఏర్పాటు చేస్తున్నదని చెప్తూ సహకార రంగానికి నాబార్డు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని మంత్రులు పేర్కొన్నారు.

## బాల్క సుమన్‌కు శుభాకాంక్షలు..

హైదరాబాద్, జనవరి 27:తెలంగాణ రాష్ట్ర సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన చెన్నూరు శాసనసభ్యులు రాష్ట్రంలోని బాల్క సుమన్ పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వెంకటేష్ నేతతోపాటు మంచిర్యాల జిల్లా ప్రజాప్రతినిధులు నాయకులు బాల్క సుమన్ కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో పార్టీని పటిష్టం చేయడంతో పాటు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గులాబీ జెండా ఎగిరేలా కృషి చేస్తానన్నారు.

## నాణ్యతా ప్రమాణాలతో పీఎంజీఎస్ పనులు: ఎర్రబెల్లి



హైదరాబాద్, జనవరి 27:తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజనపథకం (పిఎంజిఎస్ వై) ద్వారా రోడ్ల పనులు అత్యంత వేగంగా, నాణ్యతా ప్రమాణాలతో జరుగుతున్నాయని, ఎక్కడా రాజీ లేకుండా పనులు నిర్వహిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. పీఎంజీఎస్‌వై (ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన) రోడ్ల పనులపై కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి గిరిరాజ్ సింగ్ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మంత్రులు, కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం ఢిల్లీ నుండి సమీక్షించారు. తెలంగాణ రాష్ట్ర సెక్రటేరియట్ నుండి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, పీఎంజీఎస్‌వై పనులు రాష్ట్రంలో అత్యంత వేగంగా నాణ్యతతో పూర్తవుతున్నాయని తెలిపారు. ఆయా పనులను ఎప్పటికప్పుడు రాష్ట్ర అధికారులు పరిశీలిస్తూ, పర్యవేక్షిస్తూ ఉన్నారని మంత్రి తెలిపారు. నిర్ణీత గడువులోగా ఆయా పనులు పూర్తి చేస్తామని మంత్రి కేంద్రానికి తెలిపారు. అలాగే స్టేట్ షేర్, సెంట్రల్ షేర్, మెయింటెనెన్స్ నిధులు వేగంగా అందేట్లు సీఎం కేసిఆర్ తో మాట్లాడతామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమీక్షలో పీఎంజీఎస్‌వైతోపాటు రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్ట్ ఫర్ లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజం అఫెక్టెడ్ ఏరియాస్, ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస యోజన పథకాలపై కూడా సమీక్ష జరిగింది. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ ఇఎన్‌సి సంజీవరావు, సంబంధిత శాఖకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి కరోనా

హైదరాబాద్, జనవరి 27: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి కరోనా పాజిటివ్గా నిర్ధారణ అయ్యింది. గురువారం జరిపిన పరీక్షల్లో కరోనా సోకినట్లు వెల్లడయింది. గత మూడు రోజులుగా మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. కావున ఈ సమయంలో తనని దగ్గరగా కలిసిన వారంతా కరోనా పరీక్షలు చేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మహేష్ బ్యాంక్ కేసులో పురోగతి: సీపీ ఆనంద్

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మహేష్ బ్యాంక్ హ్యాకింగ్ కేసులో దర్యాప్తు జరుగుతోందని నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ కేసులో పురోగతి సాధించామని సీపీ పేర్కొన్నారు. ఇప్పటివరకు పలు ఖాతాల్లోని రూ.3 కోట్లు నిలుపుదల చేశామని సీపీ తెలిపారు. ఖాతాలు తెరిచినవారి వివరాలు, తెరిపించిన వారి వివరాలు గుర్తించామన్నారు. హ్యాకింగ్ జరగడానికి ప్రధాన కారణం బ్యాంకింగ్ సర్వర్‌లో సమస్యలేనని ఆయన పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా ఉన్నందుకు బ్యాంక్‌పై కూడా కేసు నమోదు చేస్తామని ఆయన ప్రకటించారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్‌కు సరైన సైబర్ సెక్యూరిటీ లేదన్నారు. మొత్తం 12.9 కోట్ల నగదును 3 ఖాతాల నుంచి దేశంలోని 120కిపైగా ఖాతాల్లోకి మళ్లించారని సీపీ తెలిపారు.

## గ్యాస్ అక్రమాలు ఉపేక్షించేది లేదు: పౌరసరఫరాల ఎన్ ఫోర్స్‌మెంట్ డిటీ

దేవర కొండ, జనవరి 27:: గృహ వినియోగ వంట గ్యాస్ ను ఇళ్లకు మాత్రమే సకాలంలో డెలివరీ చేయాలనీ, ఈ భాధ్యత ఆయా ఏజెన్సీలదే నని పౌరసరఫరాల శాఖనల్గొండ జిల్లా ఎన్ పోర్స్ మెంట్ డిప్యూటీ తాసిల్దార్ మాచన రఘునందన్ పేర్కొన్నారు. ఒక వేళ తమ సేవల విషయం లో డీలర్లు ఉదాసీనత, అలసత్వం తో నిర్లక్ష్యం గా ఉంటే కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే గృహ వినియోగ గ్యాస్ ను కమర్షియల్ వినియోగానికి సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం ఆయన దేవర కొండ లో ఉన్న గ్యాస్ ఏజన్సీ నీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీ సందర్భంగా కొందరు వినియోగ దారులు అసలు తమకు డోర్ డెలివరీ అన్న మాట కు అర్థం తెలియదు అన్నంతగా ఏజెన్సీ వారి సేవలు భాధ్యతా రాహిత్యం గా ఉన్నాయని అన్నారు.

దేవర కొండ , కొండ మల్లె పల్లి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తాము ఎక్కువ గా ఏజన్సీ కే వచ్చి గ్యాస్ తీసుకు పోతామని చెప్పడం, ఎక్కువ మంది గ్యాస్ బండలు హోటళ్ల లో కనపడటంచూస్తే, గృహ వినియోగదారులకు ఎలాంటి సేవలు అందుతున్నాయెా సులువుగా అర్థం చేసుకోవచ్చున్నారు. గ్యాస్ ఏజెన్సీ లో రీఫిల్ లు ఏ రోజు వరకు బుక్ అయ్యాయి? ఎన్ని డెలివరీ అయ్యాయి. ఇంకా ఎన్ని పంపిణీ కావాల్సి ఉంది ఇత్యాది అంశాల్ని రఘునందన్ నిశితంగా పరిశీలించారు.

వినియోగదారులు రశీదు మీద ఉన్న మొత్తం మాత్రమే ఇవ్వాలని స్పష్టం చేశారు. ఒక వేళ అధికంగా అడిగినా సకాలం లో డోర్ డెలివరీ చెయ్యక పోయినా స్థానిక తాసిల్దార్ కు, పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు అని చెప్పారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వహణ ఓ గొప్ప సేవా అవకాశం అని , అట్టి సేవల విషయంలో కనీస భాధ్యత, నాణ్యత విస్మరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

## గాంధీ విగ్రహం పరిసరాల సుందరీకరణ -మంత్రి తలసాని



హైదరాబాద్, జనవరి 27:సికింద్రాబాద్ లోని మహాత్మాగాంధీ రోడ్ అనగానే ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేది గాంధీ విగ్రహమే. సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని రాంగోపాల్ పేట డివిజన్ లో ఈ విగ్రహం వుంది. ఆ కారణంగానే ఈ ప్రాంతానికి ఎంజిరోడ్అనేపేరు వచ్చింది. ఇటీవల నగరంలోని పలు చారిత్రక నిర్మాణాలను కాపాడేందుకు ప్రభుత్వం వాటిని పునరుద్దరించే పనులనుచేపట్టింది. అందులో భాగంగానే సికింద్రాబాద్ బన్సీలాల్ పేట లో ఉన్న నిజాం కాలం నాటి మెట్ల భావిని ప్రభుత్వం పునరుద్దరిస్తోంది.

తాజాగా ఎంజీ రోడ్ లోని గాంధీ విగ్రహం పరిసరాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. గురువారం గాంధీ విగ్రహం పరిసరాలను మంత్రి శ్రీనివాస్ యాదవ్ మున్సిపల్ పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న గాంధీ విగ్రహానికి పక్కనే నూతనంగా మరో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ లను వేరొక చోటకు తరలించాలని ట్రాన్స్ కో ఎస్ఈ రవీందర్ ని మంత్రి ఆదేశించారు.

ప్రస్తుతం ఉన్న స్థలానికి అదనంగా పక్కనే ఉన్న స్థలాన్ని కూడా వినియోగంలోకి తీసుకొని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. గాంధీ విగ్రహం పరిసరాల అభివృద్ధికి రూపొందించిన నమూనా ను జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మంత్రికి చూపించి వివరించారు.

### చరిత్రలో నేటినిజం



-రాధశ్రీ

(జనవరి 28 గిడుగు సీతాపతి జయంతి...) సెల్: 9494481210



## కొండచరియలు విరిగిపడటంతో జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారి మూసివేత

న్యూఢిల్లీ, జనవరి 27: కొండచరియలు విరిగిపడటంతో జమ్మూ–శ్రీనగర్ జాతీయ రహదారి మూసివేసినట్లు బుధవారం రోజు విశ్వసనీయ వర్గాలు పీటీఐకి తెలిపాయి. రాంబన్ జిల్లాలో కొండచరియలు విరిగిపడడంతో జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. తుల్‌బాగ్ సమీపంలోని లోయలో ట్రక్కు బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. బుధవారం రాత్రి రాంబన్‌లోని బనిహాల్ అధికారులు తెలిపారు. 270 కిలోమీటర్ల పొడవు ఉన్న ఆల్–వెదర్ రహదారి కాశ్మీర్‌ను దేశంలోని ఇతర ప్రాంతాలతో కలుపుతోంది. దుగ్గి పుల్ వద్ద కొండచరియలు విరిగిపడటంతో రహదారిని మూసి వేయబడిందని అధికారులు తెలిపారు.

## నేడు బడ్జెట్ సమావేశాలపై కాంగ్రెస్ నేతల సమావేశం

న్యూఢిల్లీ, జనవరి 27:: పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో అనుసరించవలసిన వ్యూహాలను నిర్ణయించేందుకు కాంగ్రెస్ నేతలు శుక్రవారం ఉదయం సమావేశం కాబోతున్నారు. పార్టీ పార్లమెంటరీ స్ట్రాటజీ గ్రూప్ నేతలతో జరిగే ఈ సమావేశానికి ఆ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ నాయకత్వం వహిస్తారు.

వర్చువల్ విధానంలో జరిగే ఈ సమావేశంలో మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి, సీనియర్ నేతలు ఏకే ఆంటోనీ, కేసీ వేణుగోపాల్, ఆనంద్ శర్మ, గౌరవ్ గొగోయ్, కే సురేశ్, జైరామ్ రమేశ్, మాణిక్కం ఠాగూర్, రవ్‌నీత్ సింగ్ బిట్టు పాల్గొంటారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.




# పంజాబ్ కేసరి లజపతిరాయ్

**(28 జనవరి 'లాలా లజపతిరాయ్ జన్మదినం' సందర్భంగా)**

భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్రను పోషించిన ప్రముఖుల్లో ఒకరైన లాలా లజపతిరాయ్ బహుముఖ ప్రజ్ఞాశాలి, రచయిత, రాజకీయనాయకుడు, స్వాతంత్ర్య పోరాట విప్లవ యోధుడు. 'పంజాబ్ కేసరీ'గా పిలుచుకునే స్వాతంత్ర్య సేనాని 28 జనవరి 1865న గులాబ్‌దేవి మరియు మున్షీ రాధాకృష్ణ అగర్వాల్ (ఉపాధ్యాయులు) పుణ్యదంపతులకు ఫిరోజ్‌పూర్ జిల్లా దుడికే గ్రామంలో జన్మించారు. లాహోర్ ప్రభుత్వ కళాశాలలో న్యాయ పట్టాను పొంది, స్వామి దయానంద సరస్వతి ప్రేరణతో లాహోర్‌లో 'దయానంద ఆంగ్లో వేదిక్ పాఠశాల' నెలకొల్పారు. హిందూ ధర్మాలను నమ్ముతూ 'ఆర్య సమాజ్' స్థాపించి, జాతీయతా భావనతో హిందూ మహాసభ ఉద్యమంలో పని చేశారు. 1886లో హిస్సార్ నగరానికి మారిన పంజాబ్ కేసరి న్యాయవాద వృత్తి చేపట్టి, భారత జాతీయ కాంగ్రెస్‌లో చురుకైన కార్యకర్తగా పని చేశారు. 1888లో లాహోర్ హైకోర్టులో న్యాయవాదిగా సేవలు అందించారు. 1907లో అదుపులోకి తీసుకున్న బ్రిటీష్ ప్రభుత్వం బర్మాకు తరలించి, తదుపరి విడుదల చేశారు. 1914లో న్యాయవాద వృత్తిని త్యాగం చేసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 1984లో బ్రిటన్‌లో, రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో (1917 – 1920) అమెరికాలో ఉన్నారు. 1920లో ఇండియాకు తిరిగి వచ్చి గాంధీ చేపట్టిన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికై, 'సర్వెంట్స్ ఆఫ్ పీపుల్స్ సొసైటీ' అనబడే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. ప్రముఖ దేశభక్తులు 'లాల్ బాల్ పాల్' (లాలా లజపతిరాయ్, బాలగంగాధర తిలక్ మరియు బిపిన్ చంద్ర పాల్) త్రయంలో ఒకరైన లాలా లజపతిరాయ్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (1897), లక్ష్మి ఇన్సురెన్స్ కంపెనీ ఎదుగుదలలో చురుకైన పాత్రను నిర్వహించారు. ప్రముఖ రచయితగా 'మై స్టోరీ ఆఫ్ డిపోర్టేషన్(1908), ఆర్య సమాజ్ (1915), ది యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా: ఏ హిందూ ఇంప్రెషన్ (1916), ఇంగ్లాండ్స్ డెబ్ట్ టు ఇండియా హిందూ సమాజంలోని అంటరానితనం, కులవ్యవస్థ మరియు మహిళా వివక్ష వంటి దురాచారాల వ్యతిరేకంగా పోరాడారు. అగ్రవర్ణాలకే పరిమితమైన వేద పఠనాన్ని నిమ్నవర్గాలకు చేరువ చేశారు. 1921 – 23 మధ్య జైలు పాలైన రాయ్, అనంతరం లెజిస్లేటివ్ అసెంబ్లీకి ఎన్నికైనారు. 30 అక్టోబర్ 1928న 'సైమన్ గో బ్యాక్' అంటూ గర్జించిన లజపరిరాయ్ సైమన్ కమిషన్‌ను వ్యతిరేకించి, పోలీసుల లాటీల దెబ్బలను ఎదుర్కొన్ని తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన రాయ్ 17 నవంబర్ 1928న తుది శ్వాస విడిచారు. లాలా లజపతిరాయ్ మరణానికి ప్రత్యక్ష సాక్షి అయిన భగత్ సింగ్, బ్రిటీష్ పాలకులకు గుణపాఠం నేర్పుతానని ప్రతిన బూనినారు. విప్లవ ఉద్యమం ద్వారా వలసపాలనను అంతం చేయాలంటూ ఉడుకు రక్తం చిందించిన త్యాగశీలి లాలా లజపతిరాయ్ జీవనశైలి, దేశభక్తి, అకుంఠిత దీక్ష నేటి యువతకు సన్మార్గాన్ని చూపాలని కోరుకుందాం. లాలాకు లాల్‌సలాం చేద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## సంగారెడ్డిలో ఘనంగా 73 వ గణతంత్ర దినోత్సవం..!

**–జాతీయ జెండా ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు.**



సంగారెడ్డి జనవరి 26 (నేటి నిజం ప్రతినిధి)73 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు బుధవారం సమీకృత కలెక్టరేట్ సముదాయంలో జాతీయ జెండా ను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. కోవిడ్ నిబంధనల మేరకు గణతంత్ర దినోత్సవ వేడుకలను నిడారంబరంగా నిర్వహించారు. ఈ వేడుకలలో జిల్లా ఎస్పీ రమణకుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారి రాధికా రమణి, జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారి, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా సమీకృత కలెక్టరేట్ ఆవరణలో 73వ గణతంత్ర దినోత్సవ వేడుకలు.



మెదక్, జనవరి 26 (నేటి నిజం ప్రతినిధి) మెదక్ జిల్లా సమీకృత కలెక్టరేట్ ఆవరణలో 73వ గణతంత్ర దినోత్సవ వేడుకలను బుధవారం కోవిడ్? నిబంధనల ప్రకారం నిరాడంబరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరీశ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అంతకు ముందు బాపూజీ చిత్రపటానికి కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రమేష్, ప్రతిమాసింగ్, ట్రైనీ కలెక్టర్ అశ్విని, డీఆర్‌డీఓ శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, డీఎస్పీ సైదులు, డీఈఓ రమేష్, జిల్లా పరిశ్రమాల కేంద్ర అధికారి కృష్ణ మూర్తి, జిల్లా వ్యవసాయాధికారి పరశురాం నాయక్, డిపిఓ తరుణ్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజీ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కరోనా కారణంతో చేర్చుకోలే.. ఆస్పత్రి బయటే ప్రసవం.. ఇద్దరిని సస్పెండ్- చేసిన మంత్రి

హైదరాబాద్, జనవరి 27:ద్దరిని సస్పెండ్? చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో కొవిడ్ పాజిటివ్ గర్భిణీ గిరిజన మహిళను చేర్చుకోవడానికి ప్రభుత్వ ఆస్పత్రి నిరాకరించింది. కాగా, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆసుపత్రి వైద్యుడిని సస్పెండ్ చేశారు. బల్మూర్ మండలం బాణాల ప్రాంతానికి చెందిన చెంచు తెగకు చెందిన నిమ్మల లాలమ్మ తన బిడ్డ ప్రసవం కోసం మంగళవారం ఆ ప్రాంతంలోని ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుంది. ఆమె అడ్మిట్ కోసం వెయిట్? చేస్తుండగా పరీక్షించిన వైద్యులు ఆమెకు కొవిడ్ పాజిటివ్ అని తెలుసుకుని నాగర్‌కర్నూల్‌లోని మరో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, మహిళ కోసం అంబులెన్స్ ఏర్పాటు చేయలేదు.

కాగా, గర్భిణి తల్లి ప్రసవ నొప్పులను గమనించి ఆమె తోబుట్టువుల సాయంతో చివరికి హాస్పిటల్ గేట్‌కి సమీపంలో ఉన్న బహిరంగ ప్రదేశంలో ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఇది చూసిన ఆస్పత్రి సిబ్బంది లాలమ్మను తీసుకెళ్లి గది ఇచ్చారు. ఈ దారుణ నిర్లక్ష్యం, వివక్షను పరిగణనలోకి తీసుకున్న తెలంగాణ ఆరోగ్య మంత్రి టి హరీష్ రావు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణ, ఆన్ డ్యూటీ డాక్టర్ హరిబాబును సస్పెండ్ చేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్, ఇద్దరు వైద్యుల సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేస్తూ "గర్భిణీ స్త్రీలు కొవిడ్ –19 పాజిటివ్‌గా ఉన్నప్పటికీ వారిని అడ్మిషన్‌ను తిరస్కరించవద్దని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సంఘటనను చాలా సీరియస్?గా తీసుకోవాలని, సంబంధిత సిబ్బంది ఏ చిన్న పొరపాటు చేయద్దన్న నిబంధనలు జారీ చేశారు" .. ఈ విషయమై నాగర్‌కర్నూల్‌లోని జిల్లా కేంద్రాసుపత్రి సూపరింటెండెంట్‌ను వివరణ ద్వారా తన నివేదిక అందజేయాలని అధికారులు కోరారు.

## ప్రజా ఆరోగ్య రంగంలో శాస్త్ర సాంకేతిక సహకారాన్ని మరింత పెంపొందించేందుకు వీలు కల్పించే అవగాహన ఒప్పదం

న్యూఢిల్లీ, జనవరి 27:ఆరోగ్య పరిశోధన రంగంలో పరస్పర సహకారంతో పని చేసేందుకు వీలు కల్పించే అవగాహనా ఒప్పందంపై నిన్న సీఎస్ఐఆర్ , ఇన్‌స్టిట్యూట్ పాశ్చర్ సంతకాలు చేసాయి. ఇరు దేశాల శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిలో ఈ ఒప్పందం ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఈ ఒప్పందం ప్రకారం కొత్తగా అభివృద్ధి చెందుతున్న, పునరావృతం అవుతున్న అంటువ్యాధులు, వంశపారంపర్యంగా సంక్రమిస్తున్న రుగ్మతలపై భారత్, ఫ్రాన్స్ దేశాలు సంయుక్తంగా పరిశోధనలు నిర్వహించి వీటి నివారణకు సమర్ధంగా పనిచేసి, అందరికీ అందుబాటులో విధంగా పరిష్కార మార్గాలను అభివృద్ధి చేస్తాయి. వీటివల్ల రెండు దేశాల ప్రజలకు మాత్రమే కాకుండా యావత్తు మానవాళికి ప్రయోజనం కలుగుతుంది.

ప్రజా ఆరోగ్య రంగంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో చోటు చేసుకుంటున్న మార్పులు పై దృష్టి సారించి పరిశోధనలు చేపట్టి అధునాతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి సీఎస్ఐఆర్ , ఇన్‌స్టిట్యూట్ పాశ్చర్ కలిసి పనిచేస్తాయి. సీఎస్ఐఆర్ , ఇన్‌స్టిట్యూట్ పాశ్చర్ ల శాస్త్రవేత్తలు, రెండు సంస్థలకు చెందిన సంస్థలు, పరిశోధన శాలలు సంయుక్తంగా పరిశోధనలు చేపడతాయి.

అవగాహన ఒప్పందంపై భారత్ తరఫున సీఎస్ఐఆర్ డీజీ, డిఎస్ఐఆర్ కార్యదర్శి డాక్టర్ శేఖర్ సి. మాండే ,ఫ్రాన్స్ తరఫున ఇన్‌స్టిట్యూట్ పాశ్చర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ స్టీవార్ట్ కోలే సంతకాలు చేశారు. రెండు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం పట్ల భారతదేశంలో ఫ్రాన్స్ రాయబారి శ్రీ ఇమ్మాన్యుయేల్ లెనైన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో రెండు దేశాల మధ్య శాస్త్ర సాంకేతిక రంగాల్లో సహకారం మరింత పెరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమానికి ఫ్రాన్స్ లో భారత రాయబారి, భారత రాయబార కార్యాలయ ప్రతినిధిగా హాజరైన డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ డాక్టర్ ప్రఫుల్ల చంద్ర మిశ్రా కార్యక్రమం అమలుకు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ప్రపంచాన్ని మహమ్మారి పట్టి పీడిస్తున్న సమయంలో మానవాళి ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడిందని అన్నారు. రెండు దేశాల మధ్య కుదిరిన అవగాహన సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన భారత, ఫ్రాన్స్ దేశాల విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖల ప్రతినిధులు ఒప్పందం నూతన అధ్యాయానికి నాంది పలుకుతుందని, దీనిని విజయవంతం చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

ఎంఓయు కింద చేపట్టనున్న కార్యక్రమాలను సీఎస్ఐఆర్ –సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబి) డాక్టర్ వినయ్ కె. నందికూరి, పాశ్చర్ సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ సైంటిఫిక్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ క్రిస్టోఫే డిఎంఫెర్ట్ వివరించారు. సీఎస్ఐఆర్, పాశ్చర్ సంస్థలు ఒకేవిధమైన అంశాలపై పరిశోధన అభివృద్ధి అంశాలపై దృష్టి సారించి పనిచేస్తూ అపారమైన అనుభవాన్ని కలిగి ఉన్నాయని ఫ్రాన్స్ ఉన్నత విద్య, పరిశోధన ఆవిష్కరణల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ క్లారియే గిర్రై అన్నారు. ఒప్పందంపై హర్షం వ్యక్తం చేసిన డాక్టర్ క్లారియే గిర్రై ఇది పూర్తి స్థాయిలో అమలు జరిగేందుకు సహకరిస్తామని అన్నారు. నుండి ఆరోగ్య సంరక్షణ డొమైన్‌లోని సీనియర్ నాయకత్వం, సీఎస్ఐఆర్ , పాశ్చర్ సంస్థలకు చెందిన ఆరోగ్య రంగ నిపుణులు, రెండు సంస్థలకు చెందిన 14 మంది సభ్యులతో కూడిన ప్రతినిధి బృందం, భారతదేశం మరియు ఫ్రెంచ్ మిషన్ మరియు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి 10 మంది ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు (హైబ్రిడ్ ఆన్ భారతదేశం వైపు).

2019లో ఒప్పందంపై రెండు దేశాల మధ్య ప్రాథమిక చర్చలు జరిగాయి. దీనిపై రెండు దేశాలు 2020లో సంయుక్తంగా ఒక వర్కుషాప్ నిర్వహించాయి. రెండు సంస్థల్లో పనిచేస్తున్న అనుభవం కలిగిన యువ శాస్త్రవేత్తలు కలిసి పని చేస్తే మరిన్ని ఆవిష్కరణలు, పరిష్కార మార్గాలను అభివృద్ధి చేయవచ్చునని గుర్తించారు. కణ అభివృద్ధి , వైరాలజీ, టీకా అభివృద్ధి, అంటు వ్యాధులు, మరియు కంప్యూటేషనల్ బయాలజీ మరియు హ్యూమన్ ఎవల్యూషనరీ జెనెటిక్స్ స్టడీస్‌పై పనిచేస్తున్న సంస్థలు ఈ అంశాలపై సంయుక్త పరిశోధనలు చేపడతాయి. మానవాళికి ప్రయోజనం కలిగించే అంశాల అభివృద్ధికి పాశ్చర్ సంస్థ తో కలిసి చేసే కృషి ఫలిస్తుందన్న ధీమాను సీఎస్ఐఆర్ వ్యక్తం చేసింది.

కార్యక్రమంలో సీఎస్ఐఆర్ –సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబి) డాక్టర్ వినయ్ కె. నందికూరి, సీఎస్ఐఆర్ డీజీ, డిఎస్ఐఆర్ కార్యదర్శి డాక్టర్ శేఖర్ సి. మాండే, సీఎస్ఐఆర్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ రామస్వామి బన్సల్, శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ చీఫ్ సైంటిస్ట్ శ్రీ ఎస్.కె. వర్షన్, భారతదేశంలో ఫ్రాన్స్ రాయబార కార్యాలయ విద్య, సైన్స్, కల్చర్ డిప్యూటీ కౌన్సిలర్ డాక్టర్ నికోలస్ గెరార్డి, భారతదేశం ఫ్రాన్స్ రాయబారి శ్రీ ఇమ్మాన్యుయేల్ లెనైన్, ఇన్‌స్టిట్యూట్ పాశ్చర్ ప్రొఫెసర్ స్టీవార్ట్ కోలే పాల్గొన్నారు.

## వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కనీసం 75 శాతం ఓటింగ్ జరిగేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, జనవరి 27:వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 75 శాతం ఓటింగ్ శాతం నమోదయ్యేలా ప్రత్యేకమైన చొరవతీసుకోవాలని ఎన్నికల సంఘంతో పాటు, భారత పౌరులకు గౌరవ భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. ఓటింగ్ శాతం పెరగడం, ఎన్నికల ప్రక్రియ సాఫీగా కొనసాగడం ద్వారానే ప్రజాస్వామ్యయుతమైన వ్యవస్థ మరింత సమగ్రంగా ముందుకెళ్లగలదని ఆయన పేర్కొన్నారు. దేశంలో అభివృద్ధి అడ్డంకుల్లేకుండా ముందుకెళ్లేందుకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని శాసనసభ స్థానాలకు, పార్లమెంటు స్థానాలకు ఏకకాలంలో ఎన్నికలు జరగాల్సిన అవసరం ఉందని, ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు, సంబంధిత వర్గాల మధ్య ఏకాభిప్రాయ సాధన అత్యంత ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు.

12వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్నికల సంఘం ఢిల్లీలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి తన సందేశాన్ని పంపించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి హాజరు కావాల్సి ఉన్నప్పటికీ కరోనా నియమనిబంధనల మేరకు స్వీయనిర్బంధంలో ఉన్న ఆయన హైదరాబాద్ నుంచే తమ సందేశాన్ని పంపించారు. ఈ సందేశాన్ని మంగళవారం ఎన్నికల సంఘం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చదివి వినిపించారు. ఎన్నికల బరిలో నిలిచిన వారి యోగ్యత ఆధారంగానే వారికి ఓటేసి చట్టసభలకు పంపించాల్సిన అవసరాన్ని ఉపరాష్ట్రపతి నొక్కిచెప్పారు. ఈ ప్రక్రియలో ఓటు అర్హత ఉన్న ప్రతి పౌరుడు తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆయన సూచించారు.

1951–52లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో 44.87 శాతం ఓటింగ్ నమోదు జరిగిందని గుర్తుచేసిన ఉపరాష్ట్రపతి, 2019లో జరిగిన 17వ సార్వత్రిక ఎన్నికల్లో ఈ ఓటింగ్ శాతం 67.40 శాతానికి పెరగడం శుభపరిణామమని ఆయన అన్నారు. నాటి పరిస్థితులతో పోలిస్తే అధిక శాతం పెరుగుదల కనిపించడంలో కృషిచేసిన ఎన్నికల సంఘం, ఇతర భాగస్వామ్య పక్షాలను ఉపరాష్ట్రపతి అభినందించారు. స్వాతంత్ర్య భారతదేశంలో ఎన్నికల సంస్కరణలు తీసుకురావడంలో, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఎన్నికల సంఘం చేస్తున్న కృషిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

అయితే ఓటర్లు స్వేచ్ఛగా ఓటింగ్ లో పాల్గొనేలా చేయడంలో ఉన్న అడ్డంకులను పరిష్కరించడం, సమగ్రమైన ఎన్నికల వ్యవస్థను తీసుకురావడం ఎన్నికల సంఘం ముందున్న సవాళ్లలో ఒకటని ఉపరాష్ట్రపతి అన్నారు.

'స్వాతంత్ర్యం సాధించి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మనమంతా కొన్ని సంకల్పాలతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కనీసం 75 శాతం ఓటింగ్ నమోదయ్యేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత. ఇందులో ఎన్నికల సంఘం చేస్తున్న కృషికి బాధ్యతాయుతమైన దేశ పౌరులుగా మనందరి తోడు ఉండాలి. దేశవ్యాప్తంగా శాసనసభలు, పార్లమెంటు స్థానాలకు ఏకకాలంలో ఎన్నికలు జరగాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయసాధనతో ముందుకెళ్లాలి. వివిధ ప్రాంతాల్లో వివిధ సమయాల్లో జరిగే ఎన్నికల కారణంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి వేగానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఈ దిశగా ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలి' అని ఎన్నికల సంఘం కార్యక్రమానికి పంపిన సందేశంలో ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు 2009 నుంచి ఎన్నికల సంఘం ఆవలంబిస్తున్న ఎస్‌వీఈఈపీ (సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) విధానాన్ని ఉపరాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు.

స్వాతంత్ర భారతదేశ చరిత్రలో తొలిసారిగా 2019 సార్వత్రిక ఎన్నికల్లో మహిళల ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదవడాన్ని ఉపరాష్ట్రపతి ప్రస్తావిస్తూ, దేశంలో వస్తున్న సానుకూలమైన మార్పునకు ఇదొక సంకేతంగా అభివర్ణించారు. గతేడాది జరిగిన ఐదురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కరోనా నేపథ్యంలోనూ వేర్వేరు రాష్ట్రాల్లో 74 నుంచి 84 శాతం పోలింగ్ నమోదవడాన్ని గుర్తుచేస్తూ ఇలాంటి మార్పులు సార్వత్రిక ఎన్నికల్లోనూ రావాల్సిన అవసరం ఉందన్నారు.

ఎన్నికల ప్రక్రియలో ఉన్న అవాంతరాలను తొలగించి ప్రక్రియ మొత్తాన్ని సాఫీగా ముందుకు తీసుకెళ్లడంలో సాంకేతికతలో వస్తున్న మార్పులను సద్వినియోగ పరుచుకోవాలని కూడా ఉపరాష్ట్రపతి సూచించారు.

## ఫిబ్రవరి మొదటి వారానికల్లా దళితబంధు లబ్ధిదారుల ఎంపిక పూర్తి కావాలి....!

**–మార్చి 5కల్లా గ్రౌండింగ్ జరిగిపోవాలి.**
**–లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా రూ. 9.90 లక్షల నిధుల జమ.. రూ.10 వేలు దళిత రక్షణ నిధి.**
**–రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు .**

సంగారెడ్డి జనవరి 27 (నేటి నిజం ప్రతినిధి)ఉమ్మడి మెదక్ జిల్లాలో దళిత బంధు అమలు పై గురువారం అరణ్య భవన్ లో సమీక్షించిన రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ..

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి,మదన్ రెడ్డి, చంటి క్రాంతి కిరణ్, మాణిక్ రావు, ఒడితెల సతీష్ కుమార్, ఎఫ్ డీ సి ఛైర్మెన్ వంటెరు ప్రతాప రెడ్డి, జిల్లాల కలెక్టర్లు హరీష్, హన్మంత రావు, అదనపు కలెక్టర్లు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యే విధంగా నియోజకవర్గానికి 100 కుటుంబాలకు దళిత బంధు పథకాన్ని మొదటి విడతగా అమలు చేస్తున్నామని మంత్రి హరీశ్ రావు తెలిపారు.

ప్రతి నియోజకవర్గంలో 100 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల ప్రకారం, గ్రామాల ఎంపిక, లబ్ధిదారుల ఎంపిక త్వరగా పూర్తి చేయాలన్నారు. మార్చి 5 లోగా యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఫిబ్రవరి మొదటి వారం వరకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని, అనంతరం లబ్ధిదారుల పేరిట దళిత బంధు ప్రత్యేక బ్యాంక్ ఖాతాలు తెరవాలని సూచించారు. మార్చి 5లోగా గ్రౌండింగ్ అయ్యేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.పది లక్షల్లో గరిష్ఠంగా మూడు యూనిట్లు పెట్టుకొనే అవకాశం ఉందని, ఒకరు లేదా ఇద్దరు లేదా ముగ్గురు కలిసి ఒకే యూనిట్ పెట్టుకునే అవకాశం ఉందని మంత్రి సూచించారు.



లబ్ధిదారుల ఖాతాల్లోకి 9.90 లక్షలు వెళతాయని, మరో పది వేలకు తోడు ప్రభుత్వం మరో పది వేలు కలిపి దళిత రక్షణ నిధి ఏర్పాటు చేయడం ఉంటుందని అన్నారు. లబ్ధిదారులు నష్టపోయిన సందర్భాల్లో కలెక్టర్ల వద్ద ఉండే ఈ నిధి అండగా ఉంటుందన్నారని మంత్రి తెలిపారు.దళిత బంధు పథకం దేశంలోనే అద్భుతమైన పథకమని... దళితుల సాధికారత కోసం సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు.

డబుల్ బెడ్ రూం ఇండ్ల పై సమీక్షిస్తూ.. .ఉమ్మడి మెదక్ పరిధిలో మూడు జిల్లాల్లో నిర్మాణాలు పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇండ్లను వెంటనే లబ్ధిదారులకు అందించే ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు.

పెండింగ్ లో ఉన్నవి వెంటనే పూర్తి చేయాలని, అవసరమైన కనీస సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు.

పట్టణ ప్రాంతాలలో డబుల్ బెడ్ రూమ్లు అందుకున్న లబ్ధిదారుల వివరాలు ఆన్ లైన్ అప్ లోడ్ చేయాలని అన్నారు.మెదక్– సిద్దిపేట– ఎల్కతుర్తి రహదారి విస్తరణ పై సమీక్షిస్తూ...మెదక్ – సిద్దిపేట – ఎల్కతుర్తి రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.అవసరమైన భూసేకరణ పనులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియకు వెళ్ళాలని ఆదేశించారు.

## సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు..!



సంగారెడ్డి జనవరి 27 (నేటి నిజం ప్రతినిధి) 73వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రమణ కుమార్ జాతీయ జండాను ఆవిష్కరించారు, సిబ్బందితో కలిసి జాతీయగీతాలాపన చేసారు. అనంతరం సంగారెడ్డి జిల్లా ప్రజలందరికి 73వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. 1950 జనవరి 26 న భారత రాజ్యాగం అమలులోకి వచ్చిందని, అప్పటినుండి ప్రతి సంవత్సరం ఈ రోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. భారత రాజ్యంగ రచనలో అంబేద్కర్ గారి కృషి మరువలేనిదని, భారత రాజ్యంగ విశిష్టతను ప్రతి పౌరుడు తెలుసుకొని, మహనీయుల భాటలో నడవాలని, ప్రతి ఒక్కరు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ దేశప్రగతికి పాటుపడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డి.యస్.పి. బాలాజీ, యస్బి డి.యస్.పి. శ్రీనివాస్ నాయుడు, ఏ ఆర్ డి ఎస్ బి జనార్ధన్, ఎస్బి ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్ , డి సి ఆర్ బి ఇన్స్పెక్టర్ రామకృష్ణా రెడ్డి, ఆర్ ఐ లు హరిలాల్, కృష్ణ, డానియల్, ఎస్బి యస్.ఐ. యాదవరెడ్డి, సూపరింటెండెంట్ లు అశోక్, వెంకటేశం, డి పి ఓ ప్రెసిడెంట్ నాగరాజు, జిల్లా పోలీసు సంఘం ప్రెసిడెంట్ దుర్గారెడ్డి, మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఆయుధాగారం లోను గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా ఆయుధాగారంలో ఏ ఆర్ డిఎస్పీ జనార్ధన్ గారు జాతీయ జండాను ఆవిష్కరించి, సిబ్బందితో కలిసి జాతీయగీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లు హరిలాల్, కృష్ణ గారు, డానియల్ గారు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లజారీపై అవగాహన

న్యూఢిల్లీ, జనవరి 27:కొత్తగా నోటిపై చేయబడిన సిసిఎస్(పెన్షన్) రూల్స్, 2021 మరియు ఫేస్ అథెంటికేషన్ టెక్నాలజీని ఉపయోగించి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల జారీపై అవగాహన కల్పించే లక్ష్యంతో సెక్రటరీ (పిడిపిడబ్ల్యూ) శ్రీ వి. శ్రీనివాస్ అధ్యక్షతన పెన్షనర్స్ అసోసియేషన్‌లకు వెబ్‌నార్ నిర్వహించబడింది. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి కేంద్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సిసిఎస్ పెన్షన్ రూల్స్ 2021పై ప్రతి ప్రెజెంటేషన్ తర్వాత ఒక ప్రశ్న సమాధాన సెషన్ తర్వాత ఫేస్ అథెంటికేషన్ ద్వారా డిఎల్‌సి జనరేషన్‌పై ప్రెజెంటేషన్‌లు అందించబడ్డాయి. సెక్రటరీ (పిడిపిడబ్ల్యూ) వివిధ అసోసియేషన్‌ల నుండి 52 మంది ప్రతినిధుల బృందాన్ని కలుసుకోవడంతో పాటు నిర్మాణాత్మక చర్చలు చేయడం పట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. సిసిఎస్ పెన్షన్ రూల్స్ 2021ని 25 డిసెంబర్ 2021న విడుదల చేయడం మరియు ముఖ ప్రమాణీకరణ ద్వారా డిఎల్‌సి జనరేషన్‌ను ఇటీవల ప్రారంభించడం వంటి అంశాలపై లేవనెత్తిన వివిధ ప్రశ్నలను ఆయన అభినందించారు. పింఛనుదారులలో ఉత్సుకత చాలా అర్థమయ్యేలా ఉంది మరియు అలాంటి పరస్పర చర్యలు సన్నిహితంగా ఉండటానికి మరియు ప్రతి అసోసియేషన్‌కు చేరువయ్యేలా చూసేందుకు కొనసాగుతాయని తెలిపారు. ప్రతి అసోసియేషన్ వారి సభ్యులతో ఇలాంటి అంశాలపై క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని కూడా ఆయన అభ్యర్థించారు.డిపార్ట్‌మెంట్ మరియు పెన్షనర్స్ అసోసియేషన్‌ల మధ్య పరస్పర అవగాహనను పెంపొందించడమే ఈ సమావేశం యొక్క లక్ష్యం అని ఆయన పునరుద్ఘాటించారు. ప్రత్యేకించి తన స్థాయిలో ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా తెలుసుకోగలరని మరియు కార్యదర్శి అర్థం చేసుకునే స్థితిలో ఉంటారని అసోసియేషన్‌లకు హామీ లభిస్తుందన్నారు. పెన్షన్ డిపార్ట్‌మెంట్ చాలా చట్టబద్ధమైన మరియు విధాన ఆధారిత విభాగం కాబట్టి పెన్షనర్లకు ఎక్కువ ప్రయోజనాలను అందించడానికి సంస్కరణలు ఎక్కడ అవసరమో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం మరియు నిరంతరం నవీకరణలు మరియు చట్టంలో సవరణలు అవసరమవుతాయని మరియు అదే లక్ష్యం అని ఆయన తెలియజేశారు. ఒక్కో సంఘంలో 300 మందికి పైగా సభ్యత్వం ఉందని, వారు సభ్యులతో నిత్యం సంభాషిస్తున్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## డీసీజీఐ కీలక నిర్ణయం - కోవాగ్జిన్, కోవిషీల్డ్ వ్యాక్సిన్ల విక్రయాలకి పర్మిషన్

న్యూఢిల్లీ, జనవరి 27:డ్రగ్ కంట్రోలర్ సంస్థ డీసీజీఐ కీలక నిర్ణయాన్ని తీసుకుంది. కోవాగ్జిన్, కోవీషీల్డ్ వ్యాక్సిన్ల మార్కెటింగ్ విక్రయాలకి అనుమతిని ఇచ్చింది. మెడికల్ స్టోర్లలో వ్యాక్సిన్లు అందుబాటులో ఉండవని, హాస్పటల్స్, క్లీనిక్ లు వ్యాక్సిన్ లను కొనుగోలు చేయొచ్చని వెల్లడించింది. దేశంలో కరోనా వ్యాక్సినేషన్ మొదలైనప్పటి నుంచి ప్రజలకు ఎక్కువగా కోవీషీల్డ్, కోవాగ్జిన్ వ్యాక్సిన్లను ఇస్తున్నారు. ఇప్పటికే ఈ రెండు వ్యాక్సిన్లు కరోనాపై సమర్థవంతంగా పనిచేస్తున్నాయని పలు అధ్యయనాలు తెలియజేశాయి. కోవీషీల్డ్ ను పూణేలోని సీరం ఫార్మా సంస్థ తయారు చేస్తుండగా? కోవాగ్జిన్ ను హైదరాబాద్ బేస్ట్ భారత్ బయోటెక్ సంస్థ తయారు చేస్తోంది. ఈ మేరకు టీకా డేటా ప్రతి ఆరు నెలలకి డీసీజీఐకి వెల్లడించాలని తెలిపింది. కోవిన్ యాప్ లో కూడా డేటా అప్‌డేట్ చేయాలనే షరతులును విధించింది

# లడఖ్‌లోని సుదూర సరిహద్దు ప్రాంతాలలో 13 వేల అడుగుల ఎత్తులో నీటిని ఎలా సరఫరా చేస్తారో చూపించడానికి "జల్ జీవన్ మిషన్: ఛేంజింగ్ లైవ్స్"

న్యూఢిల్లీ, జనవరి 27:ఈ సంవత్సరం రిపబ్లిక్ దే నాడు జల్ శక్తి మంత్రిత్వ శాఖ "జల్ జీవన్ మిషన్: ఛేంజింగ్ లైవ్స్"పేరుతో శకటాన్ని ప్రదర్శిస్తుంది. కఠినమైన శీతాకాలంలో 13,000 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో, జల్ జీవన్ మిషన్ లడఖ్ ప్రజల జీవన నాణ్యతను సులభతరం చేస్తుంది. మెరుగుపరుస్తుంది. వారి ఇళ్లకు స్వచ్ఛమైన కుళాయి నీటిని అందిస్తోంది. అక్కడ, చలికాలంలో పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రత –సున్నాకు పడిపోతుంది. రాత్రి ఉష్ణోగ్రత –20 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోతుంది. విపరీతమైన శీతాకాలంలో, నీటి వనరులు స్తంభించడం, సరఫరా లైన్లు పనిచేయకపోవడం, నీటి పైపులు గడ్డకట్టడం పగిలిపోవడం వంటి కారణాల వల్ల ఇంటి గుమ్మం వద్దకు శుభ్రమైన పంపు నీటిని అందించడం చాలా సవాలుగా మారుతుంది. దేశంలోనే అత్యల్ప జనాభా సాంద్రతను కలిగిన ప్రాంతం లడఖ్ (2.8 వ్యక్తి/చదరపు కిలోమీటర్లు.), గ్రామాలు చెల్లాచెదురుగా ఉంటాయి. వర్షపాతం చాలా తక్కువ. చలికాలంలో చాలా మార్గాలను మూసివేయడం వల్ల ఇది దేశంలోని ఇతర ప్రాంతాల నుండి సంవత్సరంలో కొన్ని నెలల పాటు రాకపోకలను నిలిపివేస్తారు. ఇది పదార్థాలు, సరుకుల సరఫరాను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇప్పటికీ, చాలా నీటి వనరులు అందుబాటులో లేని ప్రాంతాలు ఉన్నాయి, లడఖ్‌లోని అనేక ప్రాంతాలలో చలికాలంలో నీటి వనరులు నిలిచిపోతాయి. వీటి నిర్మాణానికి చాలా శ్రమ అవసరం. వస్తువులను ఎత్తడానికి రవాణా చేయడానికి జంతువులు ఛ హెలికాప్టర్ల సహాయం తీసుకుంటారు.

గడ్డకట్టే ఉష్ణోగ్రతల కారణంగా, సాధారణ జీఐ పైపు స్థానంలో, హెచ్డీపీఈ పైపులను ఉపయోగిస్తారు. ప్రధాన సరఫరా లైన్లను ఫ్రాస్ట్ లైన్ క్రింద వేస్తారు. మంచు రేఖకు ఎగువన పైపులు ఎక్కడికి వచ్చినా తట్టుకోవడానికి, ఇన్సులేషన్ కోసం వీటిని 4 డీఎం గాజు ఉన్ని, కలప, అల్యూమినియం జాకెటింగ్‌లో ఉ ంచుతారు. సౌర శక్తి నీటి సరఫరా గొలుసులో అంతర్భాగంగా ఉంటుంది. పైప్‌లైన్‌లో నీటి నిరంతర ప్రవాహాన్ని నిర్ధారిస్తుంది. ఘనీభవించిన నీటి వనరుల నుండి నీటిని తీసుకోవడానికి సాంకేతిక సవాళ్లు కూడా ఉన్నాయి. అలాంటి ప్రాంతాల్లో ప్రజలు మంచును తవ్వి, కరిగిన తర్వాత తాగాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇప్పుడు వారి ఇళ్లు, పాఠశాలలు , అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వచ్ఛమైన కుళాయి నీటిని పొందుతున్నారు. అంతే కాదు, సెన్సార్ ఆధారిత ఐఓటీ సిస్టమ్ ద్వారా సరఫరా చేసే నీటి పరిమాణం, నాణ్యత పర్యవేక్షణ గురించి ప్రత్యక్ష సమాచారాన్ని తెలుసుకోవచ్చు. ఫీల్డ్ టెస్ట్ కిట్‌లను (ఎఫ్‌టికె) ఉపయోగించి నీటి నాణ్యతను పరీక్షించడానికి గ్రామాల్లోని మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ పట్టికలో, స్థానిక మహిళలు ఫీల్డ్ టెస్ట్ కిట్‌లను (ఎఫ్టీకేలు) ఉపయోగించి నీటి నాణ్యత పరీక్షను నిర్వహించడాన్ని చూడొచ్చు. ఎఫ్‌టికెల సహాయంతో ఇళ్లకు పరిశుభ్రమైన కుళాయి నీటిని అందించడానికి జల్ జీవన్ మిషన్ (జెజెఎమ్) ఇప్పటివరకు 8.6 లక్షల మంది మహిళలకు శిక్షణ ఇచ్చింది. దేశమంతటా ఇప్పుడు ప్రజలు తమ తాగునీటిని పరీక్షించుకోవడానికి నీటి పరీక్షా ప్రయోగశాలలు అందుబాటులోకి వచ్చాయి. నీటి సరఫరా, క్లోరినేషన్ మొదలైన వాటి గురించి, జేజేఎం మిషన్ పురోగతి గురించి ప్రత్యక్ష ఉష్ణోగ్రత, వాస్తవిక సమయ డేటాను ప్రదర్శించే డిజిటల్ బోర్డు కూడా ప్రదర్శిస్తారు.

జల్ జీవన్ మిషన్: ఆగస్ట్, 2019లో ప్రకటించినప్పటి నుండి 29 నెలల అతి తక్కువ వ్యవధిలో, జల్ జీవన్ మిషన్ భారతదేశంలోని 5.63 కోట్లకు పైగా గ్రామీణ గృహాలు, 8.4 లక్షల పాఠశాలలు 8.6 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలకు కుళాయి నీటి సరఫరాను అందించింది. మిషన్ ప్రకటించే సమయానికి 3.23 కోట్ల ఇళ్లకు మాత్రమే కుళాయి నీటి సరఫరా ఉంది. నేడు 8.87 కోట్లకు పైగా ఇళ్లకు కుళాయి నీటి కనెక్షన్ ఉంది. జేఈఏఎస్ ప్రభావిత జిల్లాలకు కుళాయి నీటి సరఫరా కూడా 3శాతం నుండి 40శాతంకి పెరిగింది. కోరిన జిల్లాల్లో ఇది 7.2శాతం నుండి 39శాతంకి పెరిగింది. జేజేఎం శతాబ్దాల నుండి మహిళలు పిల్లలు నీటిని తీసుకురావడంలో ఎదుర్కొంటున్న కష్టాలను తొలగిస్తోంది. గ్రామీణ భారతదేశంలోని కోట్లాది మంది ప్రజల జీవితాలను మారుస్తోంది.

లడఖ్, హిమాచల్ ప్రదేశ్ లేదా ఉత్తరాఖండ్ లేదా రాజస్థాన్ గుజరాత్ ఎడారుల వంటి ఎత్తైన ప్రదేశాలలో వాతావరణ తీవ్రత, తాగునీటి కొరతను ఎదుర్కొంటున్న సమూహాలకు పంపు నీటిని అందించడానికి జల్ జీవన్ మిషన్ దేశంలోని అత్యంత కష్టతరమైన భూభాగాల్లో పని చేస్తోంది.

# ఘోర రోడ్డు ప్రమాదం : ఇద్దరు మృతి



మెదక్, జనవరి 27:ఓ ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన విషాద ఘటన మెదక్ జిల్లా పరిధిలోని బొల్లారం రింగ్ రోడ్డుపై జరిగింది. బతుకుదెరువు కోసం వచ్చిన కూలీలు ప్రాణాలను పోగొట్టుకున్నారు. వాటర్ ట్యాంకర్ తో చెట్లకు నీళ్లు పడుతున్న నవీన్, సత్తయ్య కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి..ఓ కారు అతివేగంగా వెనుక నుంచి వచ్చి ఢీకొనడంతో ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి చూడగా.. కారులో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తిని అంబులెన్స్ లో హాస్పిటల్ కు తరలించారు. విగత జీవులుగా పడి ఉన్న సత్తయ్య, నవీన్ మృతదేహాలను పటాన్ చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# కోవిడ్ నివారణ చర్యలపై సీఎం సమీక్ష

అమరావతి, జనవరి 27:ఆంధ్రప్రదేశ్ లో కోవిడ్ నివారణ చర్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కరోనా చికిత్స, వాక్సినేషన్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా కరోనా కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. వేల సంఖ్యలో కేసులు వెలుగుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం తాజా పరిస్థితిపై అధికారులను ఆరా తీస్తున్నారు.

# జైలు నుంచే నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన ఎస్పీ కీలక నేత 'ఆజంఖాన్'

న్యూఢిల్లీ, జనవరి 27:యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో రాంపూర్ సదర్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు సమాజ్ వాదీ పార్టీ కీలక నేత ఆజంఖాన్. ఈ మేరకు ఆయన జైలు నుంచే నామినేషన్ పత్రాలను దాఖలు చేయడం విశేషం. కాగా ప్రస్తుతం ఆయన సీతాపూర్ జైల్లో ఉన్నారు. భూకబ్జాలతో పాటు ఇతర ఆరోపణలపై 2020 ఫిబ్రవరి నుంచి ఆయన జైల్లో ఉంటున్నారు. ఆజంఖాన్ నామినేషన్ వేసినట్టు ఆయన చీఫ్ ఎలెక్షన్ ఏజెంట్ ఆసిం రజా వెల్లడించారు. ఆయనను బెయిల్ పై బయటకు రప్పించేందుకు ప్రయత్నిస్తున్నామనిన్నారు. మరోవైపు ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ పై బీజేపీ నేత గౌరవ్ భాటియా విమర్శలు గుప్పించారు. ఆజంఖాన్ కు కోర్టు బెయిల్ నిరాకరించినా అఖిలేశ్ మాత్రం ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని మండిపడ్డారు. యూపీలో మాఫియా డాన్ లు తాము చట్టానికి అతీతమని భావిస్తుంటారని, నేరగాళు ఎక్కువ సంఖ్యలో ఉంటారని యోగి సీఎం అయిన తర్వాత వీరంతా భయంతో కాలాన్ని వెళ్లదీస్తున్నారన్నారు. మరోవైపు ఫిబ్రవరి 10 నుంచి ఏడు దశల్లో యూపీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 10న ఫలితాలు వెలవడనున్నాయి.

# కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌ను కలిసి గగన్‌యాన్ పురోగతిని, ఇతర భవిష్య అంతరిక్ష మిషన్లను గురించి చర్చించిన ఇస్రో నూతన చైర్మన్ డాక్టర్ ఎస్ సోమనాథ్

న్యూఢిల్లీ, జనవరి 27:ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎస్. సోమ్‌నాథ్ కేంద్ర సైన్స్ ఛ టెక్నాలజీ (ఇండిపెండెంట్ చార్జ్) సహాయ మంత్రి, ఎర్త్ సైన్సెస్ సహాయ మంత్రి (ఇండిపెండెంట్ చార్జ్), ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్లు, అణు ఇంధనం, అంతరిక్ష శాఖ సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌ను కలిసి గగన్‌యాన్ పరిస్థితితో పాటుగా సమీప భవిష్యత్తులో చేపట్టనున్న ఇతర అంతరిక్ష మిషన్ల గురించి చర్చించారు.



నూతన ఇస్రో అధిపతికి శుభాకాంక్షలు తెలుపుతూ, డాక్టర్ సోమ్‌నాథ్ ప్రతిష్ఠాత్మకమైన అసైన్‌మెంట్‌ను అత్యంత చారిత్రిక సమయంలో స్వీకరిస్తున్నారని, భారతదేశం తొలి మానవ అంతరిక్ష మిషన్ గగన్‌యాన్ సహా పలు చారిత్రిక మిషన్లకు నాయకత్వం వహించేలా విధి అతడిని శీర్వదించిందని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హయాంలో అంతరిక్ష కార్యక్రమాలకు ప్రత్యేక ప్రోత్సాహం లభించిందని, రోడ్లు, రహదారులు, రైల్వేలు, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం సహా వివిధ రంగాల్లో అంతరిక్ష సాంకేతికతను ఇప్పుడు వర్తింపచేశామని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. రానున్న కొద్ది సంవత్సరాల్లో అంతరిక్ష రంగం ద్వారా భారతదేశం అగ్రస్థానానికి ఎదుగుతుందని ఆయన అన్నారు.

గగన్‌యాన్ కార్యక్రమ స్థితి గురించిన వివరాలను మంత్రి ఇస్రోచైర్మన్ వెల్లడిస్తూ, కోవిడ్, ఇతర పరిమితుల కారణంగా టైమ్‌లైన్‌లో ఆలస్యం జరిగిందని, కాగా ఇప్పుడు అంశాలు అన్నీ పట్టాలు ఎక్కాయని, తొలి మానవరహిత మిషన్‌కు అవసరమైన వ్యవస్థలన్నీ వాస్తవరూపం దాలుస్తున్నాయని వివరించారు. తొలి మానవరహిత మిషన్ తర్వాత, ప్రయోగించనున్న రెండవ మానవరహిత మిషన్ వ్యోమమిత్ర రోబోట్‌ను తీసుకువెడుతుందని, దాని అనంతరం మానవ మిషన్‌ను ప్రయోగిస్తామని వివరించారు. భారత వ్యోమగాములు రష్యాలో సాధారణ స్పేస్ ఫ్లైట్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్నారని మంత్రి వెల్లడించారు. గగనయాన్ నిర్దిష్ట శిక్షణ కోసం బెంగళూరులో ప్రత్యేక తాత్కాలిక వ్యోమగామి శిక్షణా కేంద్రాన్ని కూడా స్థాపించారు.

మానవ మిషన్‌కు సన్నాహాలు, క్రూ ఎస్కేప్ సిస్టం ఫంక్షనింగ్ తక్కువ వాతావరణంలో (10కిమీ కన్నా తక్కువ) పనితీరును విమానంలో ప్రదర్శించాలని ఇస్రో అధిపతి తెలిపారు. సముద్రంలో ప్రభావం చూపిన తర్వాత సిబ్బంది మాడ్యూల్ ప్రయోగ పునరుద్ధరణపైన పని చేస్తున్నారని తెలిపారు.

ఎన్ఎస్ఐఎల్ (న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్) నిధులతో రూపొందించిన, ఉ పగ్రహం జిశాట్ -21 ను 2022లో ప్రయోగించిన ఘనత ఇస్రో దక్కించుకుంది. దీనికి ఎన్ఎస్ఐఎల్ భారం వహించి, నిర్వహిస్తుంది. ఈ కమ్యూనికేషన్ శాటిలైట్ డిటిహెచ్ (డైరెక్ట్ టు హోం) అప్లికేషన్ అవసరాలను తీరుస్తుంది.

రానున్న మూడు నెలల్లో చేపట్టనున్న మిషన్లను గురించి సంక్షిప్తంగా ఇస్రో చైర్మన్ ప్రెజెంట్ చేశారు. ఆయన ఫిబ్రవరి 2022లో ప్రయోగించనున్న రీశాట్-1ఎ , పిఎస్ఎల్వి సి 5-2, మార్చి 2-22లో ప్రయోగించనున్న ఓషన్‌శాట్ -3, ఐఎన్ఎస్ 2-బి ఆనంద్ పిఎస్ఎల్వి సి-53, ఏప్రిల్‌లో ప్రయోగించనున్న ఎస్ఎస్ఎల్వి -డి2, మైక్రోశాట్‌లను ప్రస్తావించారు.

# ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ (పి.ఎం.జి) పోర్టల్ ద్వారా మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ఫాస్ట్ ట్రాక్ అమలును సమీక్షించిన - శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, జనవరి 27:ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ (పి.ఎం.జి) పోర్టల్ ద్వారా పర్యవేక్షిస్తున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు వేగాన్ని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ సమీక్షించారు. ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రాధాన్యతపై అమలు చేసే ఏజెన్సీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరాన్ని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా నొక్కి చెప్పారు.

ఇన్వెస్ట్ ఇండియా యొక్క పి.ఎం.జి. పోర్టల్ అనేది మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలోని అడ్డంకుల పరిష్కారాన్ని సులభతరం చేయడంతో పాటు, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు పర్యవేక్షణను, 500 కోట్ల రూపాయల కంటే ఎక్కువ పెట్టుబడులతో సులభతరం చేయడానికి ఒక ప్రత్యేకమైన సంస్థాగత యంత్రాంగం. ప్రస్తుతం, పి.ఎం.జి., మొత్తం 48.94 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో అమలవుతున్న 1,351 ప్రాజెక్టుల అమలును పర్యవేక్షిస్తోంది. రోడ్డు, రవాణా, రహదారులు; రైల్వేలు; పెట్రోలియం, సహజ వాయువు; నూతన మరియు పునరుత్పాదక శక్తి; విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాల మంత్రిత్వ శాఖల ప్రాజెక్టులను ఈ పోర్టల్ లో పొందుపరచడం జరిగింది. ప్రాజెక్టుల అమలులో ఆటంకాలు కలిగించే సంబంధిత ప్రభుత్వ సంస్థలతో సమస్యలను ప్రస్తావించడానికి, ప్రాజెక్ట్ ప్రతిపాదకులను పి .ఎం.జి. యంత్రాంగం అనుమతిస్తుంది.

పి.ఎం.జి. పోర్టల్‌లో లేవనెత్తిన సమస్యల్లో ప్రధానంగా భూ సేకరణకు సంబంధించినవి (సుమారు 40 శాతం); వినియోగ హక్కు/మార్గాన్ని ఉపయోగించుకునే హక్కు మంజూరు (25 శాతం); అటవీ, పర్యావరణం, వన్యప్రాణుల అనుమతులు (14 శాతం) ఉన్నాయి. నిర్ణీత సమయంలో పూర్తి చేయవలసిన ప్రాజెక్టు ల పర్యవేక్షణను కూడా పి.ఎం.జి. 2021 లో చేర్చింది. సమయాన్ని, వ్యయాన్ని అధిగమించడానికి, అదేవిధంగా, ఆలస్యానికి బాధ్యత వహించే ఏజెన్సీలను, అధికారులను గుర్తించడానికి ప్రాజెక్టుల్లో జాప్యాన్ని అంచనా వేయడానికి, ఈ లక్షణం అనుమతిస్తుంది. ఒకసారి, పి.ఎం.జి. లో నమోదైన తర్వాత, ప్రాజెక్టులు, తత్సంబంధ సమస్యలను, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలతో సమావేశాల ద్వారా పరిష్కారించడం జరుగుతుంది. ఒక ప్రాజెక్టుకు సంబంధించిన భాగస్వాములందరికీ, ఈ పోర్టల్ అందుబాటులో ఉన్నందువల్ల, సాధారణ నవీకరణలు, సమావేశాల ద్వారా, సమస్యలను సమయానుకూలంగా పరిష్కరించడం వలన పోర్టల్ అతుకులు లేని సమాచారాన్ని అందిస్తుంది.

ప్రధానమంత్రి దార్శనికత లో భాగమైన ఆత్మనిర్భర్-భారత్ కు ప్రోత్సాహకరంగా, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి, ఈ పి.ఎం.జి. పోర్టల్ లో ఉన్న కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా, 2021 జూన్ నెలలో ఎంపిక చేసిన ప్రాజెక్టులను సమీక్షించడం జరిగింది. కేంద్ర మంత్రి మార్గదర్శకత్వంలో, 01.04.2021 నుంచి ఇప్పటివరకు, 17.9 లక్షల కోట్ల రూపాయల విలువైన 687 ప్రాజెక్టుల పర్యవేక్షణతో పాటు వాటిని సకాలంలో పూర్తి చేయడం కోసం, పి.ఎం.జి. పరిధిలోకి తీసుకురావడం జరిగింది. తద్వారా ప్రారంభం నుండి ఇప్పటివరకు పి.ఎం.జి. వద్ద నమోదైన మొత్తం ప్రాజెక్టుల సంఖ్య 1,726 కు చేరింది.

సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని, నిన్నటి సమీక్షా సమావేశంలో, శ్రీ పీయూష్ గోయల్ ఆదేశించారు. డి.పి.ఐ.ఐ.టి., 2021 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు కేంద్ర మంత్రిత్వ శాఖలు మరియు రాష్ట్ర ప్రభుత్వాలతో 22 సమావేశాలు నిర్వహించి, 389 సమస్యలను పరిష్కరించింది. పి.ఎం.జి. యంత్రాంగం ద్వారా, కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు అమలు చేసే ఏజెన్సీల మధ్య భారీ స్థాయి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసేలా సమన్వయం పెరిగింది.

# కట్టుదిట్టమైన చర్యలతో అక్రమ కార్యకలాపాలను అడ్రస్ లేకుండా చేయాలి

## -కరీంనగర్ పోలీస్ కమీషనర్ వి సత్యనారాయణ

కరీంనగర్ జనవరి 27: (నేటినిజం ప్రతినిధి): అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు విధినిర్వాహణలో నిక్కచ్చికంగా వ్యవహరిస్తూ అక్రమ కార్యకలాపాల నియంత్రణకు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పోలీస్ కమీషనర్ వి సత్యనారాయణ ఆదేశించారు. పోలీసులు అన్ని కోణాల్లో నిఘాను కొనసాగిస్తూ తీసుకునే కట్టుదిట్టమైన చర్యలతో అక్రమాలకు పాల్పడేందుకు ప్రయత్నించే వారి గుండెల్లో గుబులుపుట్టించాలని చెప్పారు.

అన్నివర్గాలకు చెందిన ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తూనే పోలీసింగ్ విధానాన్ని అమలు చేయడం ద్వారా శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని పేర్కొన్నారు. కమీషనరేట్‌లో పోలీస్‌శాఖ తీసుకునే చర్యలు అసాంఘీక, అక్రమ కార్యకలాపాల లాంటి చర్యలకు అడ్రస్ లేకుండా చేయాలని తెలిపారు. ఈ మధ్యకాలంలో అమలుచేస్తున్న వివిధ రకాల చర్యల ద్వారా దాదాపు పరిస్థితులు అదుపులోకి రావడంతోపాటు అన్నివర్గాల ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకాన్ని పెంపొందించడమే కాకుండా రక్షణ, భద్రత చర్యలపై భరోసాను కల్పిస్తున్నాయని చెప్పారు.

**పొంచిఉన్న ప్రమాదం... మాస్కుల వినియోగం తప్పనిసరి**

ఒమిక్రాన్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యం లో అన్నివర్గాలకు చెందిన ప్రజలు ప్రాణాల రక్షణకోసం ప్రాధాన్యతనిస్తూ విధిగా మాస్క్ లను ధరించాలని పిలుపునిచ్చారు. భౌతిక దూరం పాటించకపోవడం, మాస్కులను ధరించక అమల్లో ఉన్న నియమ నిబంధ నలను ఉల్లఘించినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మాస్కుల వినియోగంపై వివిధ విభాగాలకు చెందిన పోలీసులు ప్రతినిత్యం అవగాహ కార్యక్రమాలను కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. వైరస్‌వ్యాప్తి నియంత్రణలో భాగంగా వైద్యుల సలహాలు,సూచనలు పాటించడంతోపాటు, రోగనిరోధకశక్తిని పెంపొందించుకునేందుకు విలువైన పోషకాలతోకూడిన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. స్వీయ నియంత్రణ చర్యలు పాటించడం ద్వారానే వైరస్‌వ్యాప్తిని కట్టడి చేయవచ్చనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని తెలిపారు.

**పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి**



పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారం ద్వారా కేసుల సంఖ్య తగ్గుతుందని తెలిపారు. పెండింగ్ కేసుల్లో పరారీలో ఉన్న నిందితుల ను గుర్తించేందుకు ప్రత్యేక సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడంతోపాటు, కమీషనరేట్ కేంద్రంలో అందుబాటులో ఉన్న టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలను వేగవంతంగా ఛేదించాలని ఆదేశించారు.

**ఆందోళనల సందర్భంగా అప్రమత్తంగా ఉండాలి**

వివిధ రకాల ఆందోళనలు జరిగే సంద ర్భాలలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీయకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆందోళనలు కొనసాగించే సంస్థలు, పార్టీలు అవసరమైతే ఎలాంటి పరిస్థితులకు దారితీస్తాయో ఒక అంచనాకు రావాలన్నారు. వివిధ రకాల ఆందోళనలకు శాంతియుత వాతావరణంలో జరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

**వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చర్యలు**

యూట్యూబ్ ఛానెళ్ళు, సోషల్ మీడియాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరుల వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా పోస్టులు చేసినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివిధ రకాల ప్రసారాలు, పోస్టులు చేసే సమయంలో స్వీయనియంత్రణ పాటించాలని చెప్పారు. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు.

# కర్నూలులో ఘనంగా శ్రీకృష్ణదేవరాయల 551వ జయంతి వేడుకలు

అమరావతి, జనవరి 27:విజయనగర సామ్రాజ్యాధీశుడు కృష్ణదేవరాయలు 551వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కర్నూలు నగర కేంద్రంలోని ధర్నా చౌక్ కృష్ణ దేవరాయల విగ్రహం వద్ద కర్నూలు జిల్లా, నగర బలిజ,తెలగ, కాపు, ఒంటరి సేవా సంఘం, జిల్లా బలిజ ఉద్యోగుల వృత్తి నిపుణుల సంఘం, కాప్స్ రాక్స్, కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు కోనేటి చంద్రబాబు, జిల్లా పెద్దలు యర్రంశెట్టి నారాయణ రెడ్డి, డాక్టర్ కుళ్ళయప్ప, డాక్టర్ కొట్టె చెన్నయ్య, పత్తి ఓబులయ్య, చింతలపల్లి రామకృష్ణ, అర్జా రామకృష్ణ, కోనేటి వెంకటేశ్వర్లు తదతరులు కలసి కృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాలలు వేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ? శ్రీకృష్ణ దేవరాయలు గొప్ప పరిపాలనాదక్షుడిగా ప్రపంచ చరిత్రలో ఖ్యాతి గడించాడన్నారు. అలాంటి రాజనీతిజ్ఞుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు బలిజ వంశీయుడు కావటం మనకెంతో గర్వకారణమన్నారు. రత్నాలు రాసులుగా పోసి అమ్మినటువంటి ఘన చరిత్ర కేవలం శ్రీకృష్ణదేవరాయల వారికే దక్కిందని, అంతే కాకుండా తన పరిపాలనలో వ్యవసాయానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి చెరువులు, కుంటలను తవ్వించడం, గొలుసుకట్టు కాల్వల నిర్మాణం ద్వారా వ్యవసాయాన్ని ప్రోత్సహించి దక్షిణ భారత దేశంలో కరువు లేకుండా చేసిన గొప్ప రాజు కృష్ణదేవరాయలు




అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘీయులు గన్నపురెడ్డి శ్రీనివాస రెడ్డి, అమరం నరేష్, పాలెంశెట్టి శ్రీనివాసులు, సురేష్ మామిళ్ల, సీనియర్ జర్నలిస్ట్ శ్రీకాంత్, కప్పట్రాళ్ల మోహన్, పెద్దపాడు లక్ష్మన్న, సుబ్రమణ్యం, రాజశేఖర్, ఎక్కంటి శ్రీనివాసులు, యస్.బి మహిపతి, పవన్ కుమార్, పూజల రామ్ భూపాల్ రెడ్డి, కే శ్రీనివాస రెడ్డి, బసిరెడ్డి రాజేష్, సంజీవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తప్పిపోయిన వ్యక్తిని అప్పగించిన చైనా.. తమవైపు వచ్చిందని బంధించిన పీఎల్ఏ..

న్యూఢిల్లీ, జనవరి 27:అరుణాచల్ ప్రదేశ్‌లో అదృశ్యమైన యువకుడిని చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ భారత సైన్యానికి అప్పగించినట్లు న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు గురువారం తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ఎగువ సియాంగ్ జిల్లాలోని జిడో గ్రామానికి చెందిన 19 ఏళ్ల మిరామ్ టారోన్ జనవరి 18న అదృశ్యమయ్యాడు. బాలుడికి వైద్య పరీక్షలతో పాటు తగిన భద్రత చర్యలు అనుసరిస్తున్నట్లు మంత్రి ఒక ట్వీట్‌లో తెలిపారు. 'చైనీస్ ఖఓం అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన మిరామ్ టారోన్‌ను భారత సైన్యానికి అప్పగించింది. వైద్య పరీక్షతో సహా తగిన విధానాలు అనుసరిస్తున్నాయి" అని అతను ట్విట్టర్?లో తెలిపారు.

లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ఏసి)కి దగ్గరగా ఉన్న ప్రాంతం నుండి తప్పిపోయినందున భారత సైన్యం జనవరి 19న వెంటనే చైనా వైపుకు చేరుకుందని.. అతను దారితప్పినట్లయితే, ఆ వ్యక్తిని కనుగొనడంలో, తిరిగి తీసుకురావడానికి సహాయం కోరినట్టు మంగళవారం లోక్?సభలో రిజిజు చెప్పారు. చైనీస్ భూభాగంలోకి వెళ్లిన అతడిని పీపుల్స్? లిబరేషన్? ఆర్మీ (ఖఓం)తమ అదుపులోకి తీసుకుంది. తమ భూభాగంలోకి చొరబడ్డ బాలుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్న చైనా సైన్యంతో ఇండియన్? ఆర్మీ సంప్రదింపులు జరిపింది. ఐడెంటిటీ కోసం వ్యక్తిగత వివరాలు, ఫొటోను ధ్రువీకరించడంలో చైనాకి భారత సైన్యం సాయం చేసింది. దీంతో ప్రోటోకాల్ ప్రకారం ఆ వ్యక్తిని వెతికి తిరిగి ఇస్తానని చైనాతరఫునుంచి హామీ వచ్చిందని మంత్రి కిరణ్? రిజుజు తెలిపారు. ఆ హామీకి తగ్గట్టే తప్పిపోయిన బాలుడిని రప్పించడంలో తమ సంప్రదింపులు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు.

# విద్యాసాగర్ రావుకు మంత్రి కొప్పుల, ఎమ్మెల్సీ కవిత శుభాకాంక్షలు



హైదరాబాద్, జనవరి 27:టీఆర్ఎస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కల్వకుంట్ల విద్యాసాగర్ రావుకు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ లు పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. జగిత్యాల జిల్లాలో పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# రాజకీయ జీవితానికి 24 ఏళ్లు పూర్తి : విజయశాంతి



హైదరాబాద్, జనవరి 27: విజయశాంతి తన రాజకీయ ప్రస్థానంపై సోషల్ మీడియాలో స్పందించారు. నిన్నటితో తన రాజకీయ జీవితానికి 24 ఏళ్లు పూర్తయ్యాయని వెల్లడించారు. తాను 1998 జనవరి 26న రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. తన రాజకీయ ప్రస్థానం 25వ పడిలోకి ప్రవేశించిన సందర్భంగా తనకు అభినందనలు, శుభాశీస్సులు తెలియజేసిన అభిమానులు, శ్రేయోభిలాషులకు వినమ్రంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానంటూ ట్వీట్ చేశారు. మీ అందరి ఆదరాభిమానాలను ఎప్పటికీ ఇలాగే నిలబెట్టుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని తెలిపారు.

ఇక ఆమె రాజకీయ ప్రస్థానం గురించి చెప్పాలంటే.. విజయశాంతి మొదట బీజేపీలో చేరారు. తదనంతర కాలంలో తెలంగాణ ఉద్యమం ఊపందుకోవడంతో బీజేపీ నుంచి తప్పుకుని 2005లో తల్లి తెలంగాణ పార్టీ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత నాలుగేళ్లకు తన పార్టీని టీఆర్ఎస్ లో కలిపేశారు. 2009 ఎన్నికల్లో మెదక్ పార్లమెంటు స్థానం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచి ఎంపీ అయ్యారు. కొన్ని ప్రతికూల పరిణామాలతో ఆమె టీఆర్ఎస్ పార్టీకి దూరమయ్యారు. 2014లో కాంగ్రెస్ లో చేరిన విజయశాంతి అక్కడా ఇమడలేకపోయారు. 2020లో మళ్లీ బీజేపీ గూటికే చేరారు.

# సిటిజన్ సర్వీస్ పోర్టల్‌ను ప్రారంభించిన సీఎం జగన్

అమరావతి, జనవరి 27:ఏపీ ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సచివాలయాల ద్వారా పరిపాలనను మరింత చేరువ చేసేందుకు 'ఏపీ సేవ' పోర్టల్ ని ప్రారంభించింది. ఈ పోర్టల్ ను తాడేపల్లిలోని తన కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అన్ని సేవలను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు పోర్టల్ ను తీసుకొచ్చామని చెప్పారు. సిటిజెన్ సర్వీసెస్ పోర్టల్ ను ప్రారంభిస్తున్నామని, దీనికి 'ఏపీ సేవ' అనే పేరును పెట్టామని తెలిపారు. మారుమూల గ్రామాల్లో సైతం వేగంగా, పారదర్శకంగా అన్ని ప్రభుత్వ సేవలను ప్రజలు పొందేందుకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుందని చెప్పారు. మనకున్న వ్యవస్థను మెరుగుపరుచుకునే క్రమంలో ఇదొక ముందడుగని తెలిపారు.డాక్యుమెంట్ల కోసం ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పనిలేదని సీఎం చెప్పారు. దరఖాస్తుల పరిష్కారం ఏ దశలో ఉందో ఎప్పటికప్పుడు ప్రజలకు తెలుస్తుందని ఆన్ లైన్లోనే దరఖాస్తులు ఆమోదించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఏపీ సేవ పోర్టల్ ద్వారా మరింత వేగంగా సేవలు అందుతాయని చెప్పారు. ఈ పోర్టల్ ద్వారా ఏ అధికారి వద్ద తమ ఫైల్ ఉంది అనేది లబ్ధిదారునికి తెలుస్తుందని ఉద్యోగుల జవాబుదారీతనం మరింత పెరుగుతుందని తెలిపారు. గ్రామ స్వరాజ్యం అంటే ఏమిటో అందరికీ తెలిసేలా గత రెండేళ్ల కాలంలో అడుగులు ముందుకేశామని జగన్ చెప్పారు. ప్రభుత్వ పథకాలు, సేవలను అందించడంలో గ్రామ, వార్డు సచివాలయాలు పని చేస్తున్నాయని తెలిపారు. 4 లక్షల మంది సిబ్బంది నిరంతరం ప్రజా సేవలో ఉంటున్నారని గ్రామ స్వరాజ్యానికి ఇంతకంటే నిదర్శనం లేదని చెప్పారు.

# మృతుని కుటుంబాన్ని బియ్యం అందజేసిన ఎంపీటీసీకి గాలిపెల్లి సువర్ణ స్వామిగౌడ్



రాజన్న సిరిసిల్ల, జనవరి 27:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో గత వారం రోజుల క్రితం పాలోజి వడ్ల లక్ష్మయ్య అనారోగ్యంతో అకాల మరణం చెందగా వారి కుటుంబానికిగ్రామ ఎంపీటీసీ గాలి పెల్లి సువర్ణ స్వామిగౌడ్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసి మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు అనంతరం 25 కేజీల బియ్యం అందజేసి తన ఉదార గుణాన్ని చాటిచెప్పారు .ఆయన వెంట కాసర్ల అరుణ్ కుమార్ కూతురు బక్కయ్య పార్వతి సాయిలు గాలి పెల్లి సతీష్ గౌడ్ పార్వతి రాజు తదితరులు ఉన్నారు

# సంజీవయ్య పేరును ఆ జిల్లాకు పెట్టాలి : వీహెచ్ డిమాండ్

హైదరాబాద్, జనవరి 27:ఏపీలో కొత్తగా ఏర్పాటు చేయనున్న జిల్లాలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. జిల్లాలు, జిల్లాల కేంద్రాలపై ఇప్పటికే పలు కొత్త డిమాండ్లు తెరపైకి వచ్చాయి. మరోవైపు తెలంగాణ నుంచి కూడా ఓ డిమాండ్ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు ఈ డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య ఎంతో చేశారని వీహెచ్ కొనియాడారు. కర్నూలు జిల్లాకు చెందిన సంజీవయ్య పేరును ఆ జిల్లాకు పెట్టాలని చెప్పారు. కడపకు వైయస్సార్, విజయవాడకు ఎన్టీఆర్, మన్యం ప్రాంతానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టిన జగన్ కు? దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలనే ఆలోచన రాకపోవడం సిగ్గు చేటని అన్నారు. జగన్ దీనిపై పునరాలోచించాలని.. కర్నూలుకు సంజీవయ్య పేరు పెట్టాలని సూచించారు.

# కుమారుడిని అమెరికా ఫ్లైట్ ఎక్కించి వస్తూ రోడ్డు ప్రమాదంలో భార్యా,భర్త మృతి

చెన్నై.జనవరి 27: చెన్నై- కలకత్తా 16వ నెంబరు జాతీయ రహదారిపై ప్రకాశం జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జె.పంగులూరు మండలం రేణంగివరం వద్ద సుబాబుల్ లోడు ట్రాక్టర్ ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

చిలకలూరిపేట పట్టణం లోని పండరీపురం వాటర్ ట్యాంకులు ఎదురు సోదా వెంకట్రావు, కళావతి దంపతులు కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ప్రసన్న, భాస్కర్ లు ఉన్నారు. పెద్ద కుమారుడు సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పని చేస్తున్నాడు. చిన్న కుమారుడు భాస్కర్ ను అమెరికా పంపించేందుకు చెన్నై ఎయిర్ పోర్టుకు కారులో బుధవారం రాత్రి వెళ్లారు. ఫ్లైట్ ఎక్కించి వెంకట్రావు, కళావతి, ప్రసన్నతిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదం జరిగింది. వెంకటరావు, ప్రసన్న మృతి చెందగా కళావతి, డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో ఆస్పత్రికి తరలించారు. పొద్దున్నే ఈ విషయంతో చిలకలూరిపేట పట్టణంలోని సాంబశివ నగర్ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి.

# ఢిల్లీలో వారాంతపు కర్ఫ్యూ ఎత్తివేత

న్యూఢిల్లీ, జనవరి 27: ఢిల్లీలో కరోనా కేసుల సంఖ్య , సానుకూలత రేటు తగ్గింది. కోవిడ్ పరిస్థితి అదుపులో ఉందని, పాజిటివిటీ రేటు 10శాతం కంటే తగ్గే అవకాశం ఉందని ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యేందర్ జైన్ వెల్లడించారు. దాంతో ఢిల్లీలో వారాంతపు కర్ఫ్యూని ఎత్తి వేశారు. రెస్టారెంట్లు, సినిమా థియేటర్లు 50% కెపాసిటీతో తెరవబడతాయని చెప్పారు. అయితే ప్రస్తుతానికి పాఠశాలలు మూసివేయబడ్డాయి.ఢిల్లీ ప్రభుత్వం , లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ మధ్య జరిగిన సమావేశంలో నియంత్రణలను సడలించాలని నిర్ణయం తీసుకున్నారు.

దుకాణాలు ప్రతిరోజూ తెరవబడతాయి. వివాహాలలో అతిథుల సంఖ్య 50 నుండి 200కి పెంచబడింది. డిసెంబర్ నుంచి రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు కర్ఫ్యూ కొనసాగుతోంది.కాగా నేటి సమావేశంలో పాఠశాలలపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు, అయితే ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా నిన్న పాఠశాలల మూసివేత కారణంగా పిల్లల విద్య , మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల సామాజిక మరియు మానసిక శ్రేయస్సుకు మరింత నష్టం జరగకుండా నిరోధించడానికి" పాఠశాలలను పునఃప్రారంభించాలని ఢిల్లీ ప్రభుత్వం సిఫార్సు చేస్తుందని మిస్టర్ సిసోడియా చెప్పారు.

# రైతులపై దాడి చేసిన చిరుత.. బంధించిన ఫారెస్ట్ సిబ్బంది

తమిళనాడు,జనవరి 27: దారితప్పి అడవిలోనుంచి జనారణ్యంలోకి వచ్చిందో చిరుతపులి. తొలుత పొలం పనులకు వెళ్లిన వారిని గాయపరిచింది. ఈ విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు ప్రత్యేక బృందాలతో వచ్చి వలపన్ని పట్టుకోవాలని చూశారు. అయినా వారి నుంచి తప్పించుకునేందుకు ట్రై చేసింది. దానికి మత్తు ఇంజక్షన్లున్న బాణాలు వేసి స్పృహ తప్పేలా చేసి ఎట్టకేలకు పట్టుకున్నారు..

తమిళనాడులోని తిరుప్పూర్‌లో ఓ చిరుత పులి దారితప్పి పొలాల్లోకి వచ్చింది. ఇద్దరు రైతులతో సహా ఏడుగురిపై దాడి చేసి గాయపరిచింది. ఈ చిరుతను గురువారం అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. కాగా, నాలుగు రోజుల క్రితం ఊళ్లోకి వచ్చి పొలాల సమీపంలో వరదరాజన్, మారన్ అనే ఇద్దరు రైతులపై దాడి చేసింది. వారిని కాపాడేందుకు వెళ్లిన వారిలో మరో ముగ్గురికి కూడా గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. 60 ఏళ్ల వరదరాజన్ మొన్న తెల్లవారుజామున తన పొలానికి వెళ్లినప్పుడు చిరుత అతనిపైకి దూసుకొచ్చింది.. అతని భుజంపై పంజాతో కొట్టి గాయపరిచింది. అతడిని కాపాడేందుకు వచ్చిన వారిపైనా దాడిచేసింది. దీంతో వారంతా సమీపం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, పులిని పట్టుకుని బోనులో పెట్టే క్రమంలో అటవీ శాఖ అధికారికి కూడా గాయాలయ్యాయి.

చిరుతపులి సంచారాన్ని పర్యవేక్షించేందుకు అధికారులు 10 నిఘా కెమెరాలను ఉంచారు. చీకటిలో ఒంటరిగా వెళ్లవద్దని ఆ గ్రామా ప్రజలను కోరారు. అమ్మపాళ్యం సమీపంలో చిరుతను గుర్తించగా దానిని పట్టుకునేందుకు ప్రయత్నించిన అటవీ అధికారులపై కూడా దాడి చేసింది. తిరుప్పూర్ పట్టణంలోకి దారితప్పిన చిరుతపులికి మత్తు ఇచ్చాం. దానికి అవసరమైన అన్ని వైద్య పరీక్షల తర్వాత విడిచిపెట్టే ప్రదేశాన్ని త్వరలో నిర్ణయిస్తాం అని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ కార్యాలయం ట్వీట్ చేసింది. ఆనమలై అడవుల్లో చిరుతను వదలాలని అటవీశాఖ అధికారులు యోచిస్తున్నారు.

# పర్యాటకం అతిపెద్ద ఉపాధిని కల్పించే రంగాలలో ఒకటి మరియు ప్రత్యక్ష & పరోక్ష ఉపాధిలో కీలక పాత్ర పోషిస్తుంది: శ్రీ జి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జనవరి 27:శ్రీ జి. కిషన్ రెడ్డి భారతదేశంలో సందర్శించదగ్గ 75 అద్భుతమైన ప్రదేశాలు బుక్‌లెట్‌తో పాటు ఇన్‌క్రెడిబుల్ ఇండియా 2022 డిజిటల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు

భారతదేశం ప్రపంచానికి అందించే వివిధ పర్యాటక ఉత్పత్తులను దూకుడుగా ప్రోత్సహించడంపై పర్యాటక మంత్రి ఉద్ఘాటించారు

పర్యాటక మంత్రి దేశీయ పర్యాటక ప్రాముఖ్యత గురించి చర్చించారు మరియు మన దేశంలోని విద్యార్థులు మరియు యువతలో మరింత అవగాహన కల్పించడానికి టూరిజం క్లబ్‌లను ప్రారంభించాలని యోచిస్తున్నారు

ఈ సంవత్సరం వేడుకల థీమ్ రూరల్ మరియు కమ్యూనిటీ సెంట్రిక్ టూరిజంభారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల ఆధ్వర్యంలో ఈ రోజు 25 జనవరి 2022న వర్చువల్ ప్లాట్‌ఫారమ్‌లో రెండు గంటల కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా పర్యాటక మంత్రిత్వ శాఖ జాతీయ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకుంది. ఈ సంవత్సరం వేడుకల థీమ్ రూరల్ మరియు కమ్యూనిటీ సెంట్రిక్ టూరిజం. గ్రామీణ పర్యాటకం వారి స్థానిక జనాభాకు ఆచరణీయమైన జీవనోపాధిని అందించే నేపథ్యంలో పెరుగుతున్న సవాలును ఎదుర్కొంటున్న కమ్యూనిటీలకు విలువైన వాణిజ్య మరియు ఉపాధి అవకాశాలను అందిస్తుంది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మరియు డీఓఈఆర్ శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అరవింద్ సింగ్ ప్రారంభోపన్యాసంతో ప్రారంభించారు. అనంతరం జౌళి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ ఉపేంద్ర ప్రసాద్ సింగ్, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ గోవింద్ మోహన్, శ్రీమతి లీనా నందన్, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ కార్యదర్శి, శ్రీ జి. అశోక్ కుమార్, డైరెక్టర్ జనరల్, నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా, శ్రీ ఆనంద్ మహీంద్రా, మహీంద్రా గ్రూప్ చైర్మన్ మరియు కల్నల్ మనోజ్ కేశ్వర్, అతుల్య గంగా పరిక్రమ మొదలగు వారి ప్రసంగాలతో కొనసాగింది.

కార్యక్రమంలో కేంద్ర పర్యాటక, సంస్కృతిక మరియు డీఓఎన్ఈఆర్ మంత్రి, శ్రీ జి. కిషన్ రెడ్డి భారతదేశంలో సందర్శించదగ్గ 75 అద్భుతమైన సైట్‌లను మరియు పర్యాటక ప్రదేశాలకు అంకితం చేసిన పర్యాటక మంత్రిత్వ శాఖ ద్వారా ఇన్‌క్రెడిబుల్ ఇండియా 2022 డిజిటల్ క్యాలెండర్‌ను ప్రారంభించారు. భారతదేశం ప్రపంచానికి అందించే వివిధ పర్యాటక ఉత్పత్తులను దూకుడుగా ప్రోత్సహించడంపై మంత్రి తన ప్రసంగంలో ఉద్ఘాటించారు. పర్యాటకం అతిపెద్ద ఉపాధిని కల్పించే రంగాలలో ఒకటి మరియు ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధిలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. దేశీయ టూరిజం యొక్క ప్రాముఖ్యతను కూడా ఆయన చర్చించారు. మన దేశంలోని విద్యార్థులు మరియు యువతలో మరింత అవగాహన కల్పించడానికి టూరిజం క్లబ్‌లను ప్రారంభించాలని యోచిస్తున్నారు. ఈశాన్య ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి ఆ ప్రాంత సంభావ్యతను వెలికితీయడంతోపాటు పర్యాటకాన్ని ప్రోత్సహించడంపై కూడా ఆయన ప్రసంగించారు. గ్లోబల్ టూరిజం మార్కెట్‌లో భారతదేశ వాటాను ఎలా పెంచుకోవాలనే దానిపై మంత్రి తన అభిప్రాయాలను పంచుకున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద హెరిటేజ్ ప్రాజెక్ట్ అడాప్ట్ కింద కార్పొరేట్ సెక్టార్‌తో అనుసంధానం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, రైల్వే మంత్రిత్వ శాఖ మొదలైన వాటి సామర్థ్యాన్ని ఉపయోగించుకోవాలని మరియు దేశంలోని పర్యాటక రంగాన్ని ఎలా బలోపేతం చేయాలనే దానిపై ఆయన మాట్లాడారు.

తన ప్రారంభ వ్యాఖ్యలలో పర్యాటక మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అరవింద్ సింగ్ భారతదేశంలో ఆర్థిక వృద్ధికి కీలకమైన డ్రైవర్లలో ఒకటిగా పర్యాటక రంగం ఎలా ఉద్భవించిందన్నదానిపై మాట్లాడారు. పర్యాటకం జాతీయ సమైక్యతను ప్రోత్సహిస్తుంది మరియు మన గొప్ప దేశం యొక్క అందం మరియు గొప్ప సాంస్కృతిక వారసత్వం గురించి పౌరులకు అవగాహన కల్పిస్తుంది. ఇది అంతర్-ప్రాంతీయ సంబంధాలను కూడా ప్రోత్సహిస్తుంది మరియు సాంస్కృతిక సాధనలను ప్రోత్సహిస్తుంది. అలాగే స్థానిక హస్తకళలకు మద్దతునిస్తుంది. పోచంపల్లిలోని వస్త్ర ఉత్పత్తులు మరియు రఘురాజ్‌పూర్ కళారూపాలు దేశీయ మరియు అంతర్జాతీయ పర్యాటకులకు ప్రధాన పర్యాటక ఆకర్షణగా ఎలా ఉన్నాయో మనం చూశాము. ఉపాధిని సృష్టించడానికి మరియు పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల మధ్య సాంస్కృతిక విభజనను తగ్గించడానికి స్థానిక కమ్యూనిటీలకు పర్యాటకం నుండి ఆర్థిక ప్రయోజనాలను తీసుకురావడానికి భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో ఇటువంటి నమూనాలు పునరావృతం కావడం చాలా అవసరమని తెలిపారు.

భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ ఉపేంద్ర ప్రసాద్ సింగ్ మన దేశం యొక్క గొప్ప సంస్కృతి మరియు వారసత్వాన్ని సూచించే భారతీయ చేనేత మరియు హస్తకళల ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. చేనేత ఒ హస్తకళలు మరియు టూరిజం ఎలా కలిసి సాగుతాయి మరియు ప్రయాణ అనుభవాలను మెరుగుపరచడంలో ఇది ఎలా సహాయపడుతుందో కూడా ఆయన చెప్పారు.

భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ గోవింద్ మోహన్ సంస్కృతి మరియు పర్యాటకం మధ్య పరస్పర అనుసంధానం గురించి మాట్లాడారు. భారతదేశం గొప్ప తత్వాలు, ఆలయ నిర్మాణాలు, ప్రపంచ వారసత్వ ప్రదేశాలు కళలు ఒ హస్తకళలకు నిలయమని తెలిపారు. భారతదేశం ఒక భారీ సాంస్కృతిక భాండాగారం మరియు సంస్కృతి యొక్క కోణాలు అనేక రెట్లు మరియు అసమానమైనవి మరియు మనం వాటిని ఏకీకృతం చేయాలని కోరారు.

పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి లీనా నందన్ ఎకో టూరిజం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. దేశంలోని పర్యాటక రంగం యొక్క సంభావ్యత మరియు వృద్ధిని బాధ్యతాయుతంగా మరియు స్థిరమైన పద్ధతిలో ఎలా ఉపయోగించవచ్చో కూడా ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు. టైగర్ రిజర్వ్‌లు, అభయారణ్యాలు, సముద్ర మండలాలు మొదలైన వాటితో సహా దేశంలోని జీవవైవిధ్యంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అనుసంధానించబడిన సంఘాలు ఒ వాటాదారుల జీవనోపాధి అవకాశాలను బలోపేతం చేయడానికి పర్యాటకం సహాయపడుతుందని తెలిపారు.

గంగా పరీవాహక ప్రాంత సమగ్ర పునరుద్ధరణ, పరిరక్షణ కోసం ప్రారంభించిన ప్రాజెక్ట్ గురించి క్లీన్ గంగా నేషనల్ మిషన్ డైరెక్టర్ జనరల్ శ్రీ జి. అశోక్ కుమార్ మాట్లాడారు. సమగ్ర ప్రణాళిక మరియు నిర్వహణ కోసం ఇంటర్ సెక్టోరల్ కో-ఆర్డినేషన్‌ను ప్రోత్సహించడానికి మరియు నీటి నాణ్యత మరియు పర్యావరణ స్థిరత్వాన్ని నిర్ధారించే లక్ష్యంతో గంగా నదిలో కనీస పర్యావరణ ప్రవాహాలను నిర్వహించడానికి నదీ పరీవాహక విధానాన్ని అనుసరించడం ద్వారా గంగా నది యొక్క కాలుష్యాన్ని సమర్థవంతంగా తగ్గించడం మరియు పునరుజ్జీవింపజేయడం గురించి వెల్లడించారు.మహీంద్రా గ్రూప్ చైర్మన్ శ్రీ ఆనంద్ మహీంద్రా భారతదేశంలోని పర్యాటకం మరియు జాతీయ సమైక్యత కోసం దేశీయ పర్యాటక ప్రాముఖ్యతపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. భారతదేశం యొక్క గొప్ప వైవిధ్యం మరియు వారసత్వం నిరాడంబరమైన బడ్జెట్ ప్రయాణీకుల నుండి అసమానమైన విలాసవంతమైన అనుభవం వరకు పర్యాటకుల యొక్క వివిధ విభాగాలను తీర్చగలవని చెప్పారు.కల్నల్ మనోజ్ కేశ్వర్ అతుల్య గంగా పరిక్రమ భారతీయ నదుల పునరుజ్జీవనం ఒ పునరుద్ధరణ మరియు వాటి పర్యావరణ వ్యవస్థ యొక్క దృష్టితో గంగా పరిక్రమ గురించి తన అనుభవాన్ని పంచుకున్నారు. గంగా పరిక్రమ కాలినడకన ప్రయాగ్‌రాజ్ నుండి గంగాసాగర్ మరియు గంగోత్రి వరకు మరియు తిరిగి ప్రయాగ్‌రాజ్ వరకు 190 రోజుల ప్రయాణం. ఈ మార్గంలో వివిధ నగరాలు మరియు గ్రామాలను తాకి 5530 కిలోమీటర్లు మరియు మార్గంలో మిలియన్ల మంది ప్రజలను ఈ యాత్ర తాకింది.యాక్టివ్ జనభాగిదారీ కోసం మరియు పౌరులకు ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌గా పర్యాటక మంత్రిత్వ శాఖ మైగోవ్‌తో సహకరించింది. అలాగే నేషనల్ టూరిజం డే-పోస్టర్ డిజైన్ కాంటెస్ట్, నేషనల్ టూరిజం డే- కాలర్ ట్యూన్ కాంటెస్ట్, నేషనల్ టూరిజం డే - పిక్చర్ క్విజ్ మరియు రైట్- వంటి కార్యకలాపాలను నిర్వహించింది. 'అన్‌సీన్ ఇండియా'పై పోటీ - భారతదేశంలోని 75 తక్కువ-తెలిసిన సైట్‌లపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యకలాపాలు భారతదేశం అంతటా అందరికీ అందుబాటులో ఉంటాయి మరియు విజేతలకు ఉత్తేజకరమైన బహుమతులు అందజేయబడతాయి.

11,000 కంటే ఎక్కువ మంది నమోదిత టూరిస్ట్ గైడ్‌లు ఒ ట్రావెల్ మరియు టూరిజం వాటాదారులకు ఆర్థిక సహాయాన్ని అందించడంతోపాటు 5 లక్షల ఉచిత టూరిస్ట్ వీసాలు జారీ చేయడం వంటి పర్యాటక పరిశ్రమకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం వివిధ ఆర్థిక మరియు ఉపశమన చర్యలను ప్రకటించింది. భారతదేశం తన పౌరులకు 150 కోట్ల వ్యాక్సిన్ డోస్‌లను అందించే చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది

# చైతన్య యూత్ క్లబ్ ఎన్నికల్లో రొమాల జగదీశ్వర్ 104 ఓట్ల మెజారిటీ తో గెలుపు



రాజన్న సిరిసిల్ల, జనవరి 27:(నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలో ని నూకలమర్రి గ్రామంలోని చైతన్య యువజన సంఘము ఎన్నికలు గురువారం రసవత్తరంగా జరిగినట్లు జిల్లా యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు సోమినేని బాలు ప్రకటన లో తెలిపారు ఈ ఎన్నికలు 2022 నుండి 2023జనవరి 26 వరకు పనిచేసే కార్యవర్గాన్ని ఓటింగ్ ద్వారా భారీ సంఖ్యలో యువత పాల్గొని విజయవంతం చేయడంతో గ్రామంలో అభినందనీయమని బాలు అన్న నూతన అధ్యక్షుడిగా రొమాల జగదీశ్వర్ పర్శరాములు పై 104 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు గ్రామ సర్పంచ్ పెంద్యాల తిరుపతి ఎంపీటీసీ శంకరవ్వ రాములు తెలిపారు ఈ ఎన్నికల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ యువతగ్రామాల్లో సామాజిక సేవ కార్యకర్తలు గా పనిచేయాలని ప్రజలకు అవగాహన చేయాలని కరోన గురించి వారికి చెప్పాల్సిన భాద్యత ఈ కొత్తగా ఎన్నికయిన కార్యవర్గం మీద భాద్యత ఉందని బాలు సూచించారు కార్యవర్గం ఉపాధ్యక్షులు గా సామల్ల భాస్కర్ ప్రధాన కార్యదర్శిగా పొత్తూరి జనార్దన్ సహాయ కార్యదర్శిగా బొడ్డు సుధీర్ ఆటల కార్యదర్శి గా సామల్ల గంగరాజు సాంస్కృతిక కార్యదర్శిగా కైరా లింగన్న కోశాధికారిగా సామల్ల రజిని కాంత్ ఎన్నికవడం జరిగింది ఈ ఓటింగ్ లో 167 మంది యువకులు పాల్గొన్నారు ఇంకా డైరెక్టర్ డొంతుల అంజనీ కుమార్ బొడ్డు నారాయణ పాలకుర్తి పర్సరాములు భానుప్రతాప్ మల్లయ్య బొడ్డు ప్రశాంత్ నవీన్ రణదీర్ రాజు ప్రవీణ్ వంశీ విశ్రీనివాస్ రాజశేఖర్ ప్రకాష్ యువత పాల్గొన్నారు అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు టపాసులు పేల్చారు

# 1000 పైగా సభ్యత్వాలు చేయించిన మాజీ కౌన్సిలర్ ను సన్మానించిన ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, జనవరి 27:(నేటినిజం ప్రతినిధి):కాంగ్రెస్ పార్టీ డిజిటల్ సభ్యత్వం లో భాగంగా గురువారం మాజీ కౌన్సిలర్ తుమ్ మధు 1000 సభ్యత్వాలకు చేసిన సందర్భంగా ఆయనతో పాటు 100 సభ్యత్వాలు చేసినటువం టి వారిని కాంగ్రెస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇన్చార్జ్ ఆది శ్రీనివాస్ సన్మానించారు . ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ డిజిటల్ సభ్యత్వం సందర్భంగా సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి రెండు లక్షల ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారుఇప్పటివరకు నియోజకవర్గ స్థాయిలో 20 వేల పైచిలుకు సభ్యత్వాలు చేయడం జరిగిందని సభ్యత్వాలు చేసినటువంటి వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నాయకుడు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి చిలక రమేష్ కనికరం రాకేష్ ప్రకాష్ గణేష్ రాజేందర్ తదితరులు ఉన్నారు

# టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ బీమా చెక్కును అందజేసిన టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు



రాజన్న సిరిసిల్ల, జనవరి 27:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామం లో టీఆర్ఎస్ పార్టీ కార్యకర్త గొనె అంజిరెడ్డి గారు ప్రమాదవశాత్తు మరణించగా వారి కుటుంబ సభ్యులకు , టీఆర్ఎస్ పార్టీ తరపున పార్టీ తరపున ఇన్సూరెన్స్ 2 లక్షలు అతని భార్య గొనె మదురవ్వ అందజేశారు . ఈ సందర్భంగా ఎంపి బూర వజ్రమ్మ బాబు ,సర్పంచ్ ఉరిడి రాంరెడ్డి, తెరాస పార్టీ అర్బన్ మండల అధ్యక్షుడు ఉరిడి ప్రవీణ్ మాట్లాడుతూ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఒకవైపు పార్టీ కార్యకర్తలు సంక్షేమాన్ని మరోవైపు ముందుకు తెలుసుకుంటున్న ఏకైక మన ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారుపార్టీ కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి ఆత్మస్థైర్యం ఇచ్చేందుకు పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ ఇలాంటి కార్యక్రమాలు పెట్టారని తెలిపారు .పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎమ్మెల్యే రమేశ్ బాబు ఆధ్వర్యంలో కార్యకర్తలకు అండగా ఉంటామని వారు తెలిపారు.మృతుని కుటుంబ సబ్యులు గౌరవ ముఖ్యమంత్రి చంద్రశేక రావు రమేష్ బాబు చెన్నమనేని కి కృతజ్ఞతలు తెలియజేశారు , అలాగే పాలోజు లక్ష్మయ్య గారు అకాలమరణం చాల బాధ కరం వారి కుటుంబ సబ్యులను పరమర్శించి టీఆర్ఎస్ పార్టీ తరపున 25 కేజీలు , తన వ్యక్తిగత సర్పంచ్ ఊరడి రాంరెడ్డి 25 కేజీల బియ్యం అందజేశారు జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యక్రమం లో ,పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు నడిగొట్ల హరికృష్ణ , ఉపసర్పంచ్ తాడెం శ్రీనివాస్ వార్డ్ సభ్యులు తునికి కనుకరాజు , పీ ఏ సీ ఎస్ డైరెక్టర్ లు కట్ట ఎల్లయ్య , ఊరడి బాలకిషన్ , వంకాయల రాజశేకర్ , తాడెం లచ్చయ్య , యువజన ఉపాధ్యక్షులు పార్వ పార్వతి భూమేశ్ , ఆర్గనైజింగ్ సెక్రటరి గుండెల్లిరాజు , సినియర్ నాయకులు ఊరడి రాజిరెడ్డి , వంకాయల నరేష్ , మొహమ్మద్ భాషు , గుండెల్లి హనుమండ్లు , తెరాస నాయకులు తదితరులు పాల్గొన్నారు

# నేటి నుండే టాటా ఎయిరిండియా సేవలు ? కరాచీ నుండి ముంబైకి తొలి విమానం



న్యూఢిల్లీ, జనవరి 27: నేటి నుండి టాటా గ్రూప్ నుంచి ఎయిరిండియా సేవలు అందించనుంది. ఈ మేరకు ప్రపంచస్థాయి విమానయానసంస్థని రూపొందిస్తాం అని టాటా తెలిపారు. ఎయిరిండియాలో వందశాతం వాటిని కేంద్రం విక్రయించింది. 69ఏళ్ల తర్వాత టాటా గ్రూప్ చేతికి ఎయిరిండియా దక్కింది..గతేడాది అక్టోబర్ 8న ఎయిరిండియా బిడ్ ను గెలుచుకుంది టాటా గ్రూప్. రూ. 18వేల కోట్లని వెచ్చించి ఎయిరిండియాను సొంతం చేసుకుంది టాటా గ్రూప్ సంస్థ. కరాచీ నుండి ముంబైకి తొలి విమానం బయలుదేరనుంది. 1946లో ఎయిరిండియాగా పేరుని మార్చారు. స్వాతంత్ర్యం అనంతరం 49శాతం భాగస్వామ్యం తీసుకుంది కేంద్రం.

టాటా గ్రూప్ ఎయిర్ ఇండియాను.. ప్రభుత్వం నుండి అధికారికంగా స్వాధీనం చేసుకుంది.

టాటా గ్రూప్‌లో ఎయిరిండియా తిరిగి చేరినందుకు మేము చాలా సంతోషిస్తున్నాము అని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. టాటా గ్రూప్ గురువారం ఎయిర్ ఇండియాను ప్రభుత్వం నుండి అధికారికంగా స్వాధీనం చేసుకుంది. "ఎయిరిండియాను తిరిగి టాటా గ్రూప్‌లో చేర్చుకోవడం పట్ల మేము చాలా సంతోషిస్తున్నాము , దీనిని ప్రపంచ స్థాయి విమానయాన సంస్థగా మార్చడానికి కట్టుబడి ఉన్నాము" అని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. మిస్టర్ చంద్రశేఖరన్ కూడా అధికారిక అప్పగింతకు ముందు ప్రధాని నరేంద్ర మోడీని కలిశారు.

# భారీ అగ్ని ప్రమాదం



జమ్ముకశ్మీర్,జనవరి 27: జమ్ముకశ్మీర్ పరిధిలోని శ్రీనగర్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. రాజ్‌బాగ్‌లోని వాణిజ్య భవనంలో ఈరోజు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ భవనంలోని స్థానికులంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటినా ప్రమాద స్థలానికి చేరుకున్న అగ్నిమాపక అధికారులు.. ఫైరింజన్ సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఆ భవనంలోని సిలిండర్ పేలడంతోనే ఈ ఘటన జరిగినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ క్రమంలో మంటలను అదుపుచేస్తుండగా ఒక ఫైర్ అధికారి గాయపడినట్టు సమాచారం. ఈ భారీ అగ్నిప్రమాద ఘటనలో ఇంతవరకు ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎవరికీ భయపడేది లేదు : బండి సంజయ్

హైదరాబాద్, జనవరి 27:తాము ఎవరికీ భయపడేది లేదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని నందిపేటలో బీజేపీ కార్యకర్తలను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ? బీజేపీ ఎంపీలపైనే దాడులు చేస్తారా అన్నారు. టీఆర్ ఎస్ నేతలు ఫ్రస్టేషన్ లో ఉన్నారన్నారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని.. వారికి మద్దతు నిరసనలు తెలిపితే దాడులు చేయిస్తుందన్నారు. మొన్న తనపై దాడి చేశారని, నిన్న అరవింద్ పై దాడి చేశారన్నారు. ఈ దాడులకు భయపడే ప్రసక్తే లేదన్నారు.

# యోగి తప్పనిసరిగా గెలవాలి: రైతు నేత రాకేశ్ తికాయత్

లఖ్‌నవూ, జనవరి 27:: ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో గోరఖ్‌పూర్ నుంచి పోటీ చేయబోతున్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తప్పనిసరిగా గెలవాలని భారతీయ కిసాన్ యూనియన్ అధినేత రాకేశ్ తికాయత్ అన్నారు. తాము ఏ పార్టీకి మద్దతు ఇవ్వడం లేదని చట్ట సభలో తగినంత ప్రతిపక్ష బలం ఉండాలని, ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో సైతం బలమైన ప్రతిపక్షం కావాలనే ఉద్దేశంతోనే యోగి గెలుపును కాంక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ "మేము ఏ పార్టీకి మద్దతు ఇవ్వడం లేదు. ఈ ఎన్నికల్లో మాత్రం యోగి ఆదిత్యనాథ్ గెలవాలనే అనుకుంటున్నాం. మన రాష్ట్రానికి చాలా బలమైన ప్రతిపక్షం కావాలి" అని అన్నారు.

కొద్ది రోజుల క్రితం సమాజ్‌వాదీ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు తికాయత్ ప్రకటించారు. కాగా, ఏ పార్టీకి తాము మద్దతు ఇవ్వబోమని ఆయన తాజాగా పేర్కొనడం గమనార్హం. ఇక వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా కొనసాగిన సుదీర్ఘ రైతుల నిరవధిక ఆందోళనలో తికాయత్ ప్రముఖంగా వ్యవహరించారు. అంతే కాకుండా చట్టాలను వెనక్కి తీసుకోకపోతే బీజేపీకి వ్యతిరేకంగా ఎన్నికల్లో ప్రచారం చేస్తామని హెచ్చరించారు. అయితే చట్టాలను వెనక్కి తీసుకుంటున్నట్లు నవంబర్‌లో మోదీ ప్రకటించారు. అయినప్పటికీ ఎంఎస్‌పీపై చట్టబద్ధత సహా మరిన్ని రైతుల డిమాండ్లు మిగిలే ఉన్నాయని తికాయత్ చెప్పారు.

# ఫోన్ మాట్లాడడం తగ్గించమని తండ్రి మందలించడంతో యువకుడి ఆత్మహత్య

రంగారెడ్డి, డిసెంబర్ 29 ఫోన్ మాట్లాడడం తగ్గించమని తండ్రి మందలిచడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడే. ఈ సంఘటన బుధవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ధారూరు సీఐ తిరుపతిరాజు తెలిపిన ప్రకారం.. కోట్‌పల్లి గ్రామానికి చెందిన చాకలి అఖిలేష్ (20) జహీరాబాద్ మహీంద్రా కంపెనీలో అప్రెంటీస్ చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఫోన్ మాట్లాడే విషయంలో కుమారుడిని తండ్రి మందలించాడు.

దీంతో మనస్తాపం చెందిన అఖిలేష్ మంగళవారం ఇంట్లో నుంచి బైక్ పై వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబీకులు బుధవారం కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టారు. ఈ క్రమంలో పోలీసులు అఖిలేష్ బైక్‌ను నాగసముందర్ సమీపంలో కోట్‌పల్లి ప్రాజెక్టు తూము కాల్వ దగ్గర గుర్తించారు. బోటింగ్ నిర్వాహకుల సాయంతో అఖిలేష్ మృతదేహాన్ని చెరువులో నుంచి బయటికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తిరుపతిరాజు చెప్పారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.